## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులు అరెస్టు..

నిజామాబాద్, మే 13బీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలోని రెండు చోట్ల ఎన్ఫోర్స్మెంట్ టీం దాడులు నిర్వహించినట్లు ఎన్ఫోర్స్మెంట్ సీఐ వెంకటేష్ తెలిపారు. వేల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం దాడి నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న యాళ్ల రిశ్వాంత్ అనే యువకున్ని అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుండి గ్రా.750 గంజాయి, బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. అనంతరం ఆర్మూర్ పట్టణంలో సోదాలు నిర్వహించగా అక్కడ షేక్ సమీర్, షేక్ కలీం అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని 2 ద్విచక్ర వాహనాలు, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. రెండు చోట్ల నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మొత్తం 3.050 కిలోల ఎండు గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు మూడు సెల్ ఫోన్ లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ నరసింహ చారి, సిబ్బంది భూమన్న, గంగారాం, విష్ణు, సాయికుమార్ పాల్గొన్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :70 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 14-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా..!



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలకమైన పదవుల్లో ఒకటైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పదవిలోకి సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నుంచి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా కె. రామకృష్ణారావు కొనసాగుతుండగా.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రిటైర్మెంట్ అయ్యారు. ఆమె స్థానంలో కె. రామకృష్ణారావు సీఎస్‌గా నియమితులవడంతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్థానం ఖాళీ అయ్యింది. దీనితో తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ పదవిలోకి సందీప్ కుమార్ సుల్తానియాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.నేడు (మే 13) సాయంత్రం లేదా రేపు ఉదయం సందీప్ సుల్తానియా తన కొత్త బాధ్యతలు అధికారికంగా చేపట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. సుల్తానియాను ఆర్థిక శాఖకు నియమించడంపై అధికార వర్గాల్లో విశ్వాసం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విధానాల అమలు, బడ్జెట్ నిర్వహణ, ఆర్థిక అనుభవం కలిగిన అధికారిగా ఆయనకు మంచి పేరు ఉంది.

## ఆపరేషన్ సిందూర్ దాడుల్లో 11 మంది సైనికులు మృతి, ఎట్టకేలకు ఒప్పుకున్న పాకిస్తాన్

ఇస్లామాబాద్: పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఉగ్రవాదుల అంతమే లక్ష్యంగా భారత బలగాలు గత వారం పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి విజయవంతంగా నేలమట్టం చేశాయి. అనంతరం పాక్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులకు ప్రయత్నించగా భారత సైన్యం దుమ్మురేపింది. పాక్ నుంచి వచ్చిన వాటిని వచ్చినట్లు గాల్లోనే పేల్చివేసి విజయం సాధించింది. అంతటితో ఆగకుండా పాక్‌లోని పలు నగరాల్లో ఎయిర్ బేస్ కేంద్రాలపై భారత్ చేసిన దాడుల్లో తమకు నష్టం జరిగిందని పాకిస్తాన్ ఎట్టకేలకు అంగీకరించింది. భారత బలగాలు చేసిన ఆపరేషన్ సింధూర్ ప్రతీకార దాడుల్లో 11 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారని పాక్ ఒప్పుకుంది. ఆ దాడుల్లో మరో 78 మంది పాక్ సైనికులు గాయపడ్డారని స్పష్టం చేసింది. ఐదుగురు పాక్ ఆర్మీ, ఆరుగురు ఎయిర్ ఫోర్స్ సైనికులు ప్రాణాలు కోల్పోయారని పాక్ తొలిసారి ఒప్పుకుంది.

**పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్**

ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో బైసరన్ లోయలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్రవాద దాడిలో ఓ నేపాలీ సహా 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.దానిపై త్రివిధ దళాధిపతులతో సుదీర్ఘంగా చర్చించిన కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌కు రూపకల్పన చేసింది. మే 6-7 రాత్రి పాకిస్తాన్, పీఓకే లోని 9 ఉగ్రవాద శిబిరాలపై క్షిపణి, డ్రోన్ దాడులు చేసి వాటిని నేలమట్టం చేశాయి. భారత బలగాలు చేసిన ఆ దాడుల్లో కనీసం 100 మంది ఉగ్రవాదులు మరణించారని భారత బలగాలు ప్రకటించాయి. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం ఇదే విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాదుల ఏరివేత, అంతానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని లక్ష్యం పూర్తయ్యే వరకు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**దాడులకు యత్నించి పాక్ ఆర్మీ నవ్వులపాలు**

భారత్ ఉగ్రస్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని, ఆర్మీ జోలికిగానీ, పాక్ ప్రజలను టచ్ చేయలేదని స్పష్టం చేసినా పాక్ పెడచెవిన పెట్టింది. మే 7 నుంచి మే 10 తేదీల మధ్య పాకిస్తాన్ డ్రోన్లు, క్షిపణులతో భారతదేశంపై దాడికి ప్రయత్నించి నవ్వులపాలు అయింది. పాక్ నుంచి వచ్చిన డ్రోనల్లు, క్షిపణులతో పాటు ఫైటర్ జెట్స్ ను సైతం భారత బలగాలు ఎస్



400 సాయంతో కూల్చేశాయి. కేవలం ఉగ్రవాదులను టార్గెట్ చేస్తే.. పాక్ తోక జాడించడాన్ని సీరియస్ గా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం భారత బలగాలు సత్తా చాటాలని సూచించింది. దాంతో పాక్ లోని లాహోర్, కరాచీ, రావల్పిండి లాంటి నగరాలలో ఎయిర్ బేస్ స్థావరాలపై భారత్ డ్రోన్, క్షిపణి దాడులతో దుమ్మురేపింది. భారత్ దాడుల్లో పాక్ కు భారీ నష్టం జరిగింది. అయితే తమ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నిస్తూ.. అటు సామాన్య పౌరులపై కాల్పులు జరుపుతున్న పాక్ కు బుద్ధి చెప్పేందుకు ఆ పనిచేశాం.

**నష్టం జరిగిందని ఒప్పుకున్న పాకిస్తాన్**

మొదట భారత్ పంపిన డ్రోన్లు, ఫైటర్ జెట్లు, క్షిపణులను కూల్చివేశామని పాక్ ఆర్మీ ప్రకటించుకుంది. పాక్ ప్రభుత్వం సైతం ప్రజలతో విజయోత్సవాలు చేసుకుని నవ్వులపాలు అయింది. ఈ క్రమంలో అమెరికా మధ్యవర్తిత్వం చేయడం, కాల్పుల విరమణకు పాక్ నుంచి పదే పదే రిక్వెస్ట్ రావడంతో ప్రాణ నష్టం జరగకూడదని భావించి భారత్ కాల్పుల విమరణకు అంగీకరించింది. మే 10న కాల్పుల విమరణ తరువాత పరిస్థితి కొంత సద్దుమణిగింది. సోమవారం సైతం పాక్, భారత్ డీజీఎంలు ఆన్‌లైన్‌లో సమావేశమై చర్చించారు. తాము కాల్పులు జరపడం, దాడులకు దిగడం లాంటివి చేసే ఉద్దేశం లేదని పాక్ స్పష్టం చేసింది. అయితే ఇటీవల పాక్ లోకి చొచ్చుకెళ్లి పలు నగరాల్లోని ఎయిర్ బేస్ సెంటర్లపై భారత్ జరిపిన దాడుల్లో 11 మంది తమ సైనికులు మృతిచెందగా, పలువురు జవాన్లు గాయపడ్డారని పాక్ అంగీకరించింది.

## కోయంబత్తూరు మహిళా కోర్టు సంచలన తీర్పు..



చెన్నై:ఆరు సంవత్సరాల క్రితం తమిళనాడును కుదిపేసిన పొల్లాచి లైంగిక వేధింపుల కేసులో తొమ్మిది మందిని దోషులుగా తేల్చుతూ కోయంబత్తూరులోని మహిళా కోర్టు మే 13న మంగళవారం తీర్పు వెలువరించింది.న్యాయమూర్తి ఆర్ నందిని దేవి తీర్పు వెల్లడించారు. సామూహిక అత్యాచారం కేసులో పురుషులను దోషులుగా నిర్ధారించారు. పొల్లాచ్చి సెక్స్ రాకెట్ లో తొమ్మిది మందికి జీవిత ఖైదు విధించింది కోయంబత్తూరు మహిళ కోర్టు. మరణం వరకు జీవిత ఖైదు విధించింది కోర్టు. బాధిత మహిళలకు 85 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. 2019లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపినా పొల్లాచ్చి సెక్స్ రాకెట్ కేసు. పూర్తి స్థాయి లో విచారణ చేపట్టింది సిబిఐ. తొమ్మిది మందిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టింది. మొత్తం 9 మంది నిందితులు నేరపూరిత కుట్ర, లైంగిక వేధింపులు, అత్యాచారం, సామూహిక అత్యాచారం, పదేపదే అత్యాచారం వంటి అభియోగాలను ఎదుర్కొన్నారు. తొమ్మిది మందిని దోషులుగా తేల్చింది కోర్టు. ఫేస్ బుక్ లో అమ్మాయిలతో పరిచయాలు పెంచుకోవడం, ప్రేమిస్తున్నానంటూ వారిపై అత్యాచారాలకు పాల్పడటం, వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ కి పాల్పడం, ఎవరికైనా విషయం చెబితే ఇంటర్నెట్ లో వీడియో అప్ లోడ్ చేస్తామని వందలాది యువతులను బెదిరించింది ముఠా. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులుగా ఉన్నారు. ఎన్ శబరిరాజన్ అలియాస్ రిష్వంత్, కె తిరునావుక్కరసు, ఎం సతీష్, టి వసంతకుమార్, ఆర్ మణి అలియాస్ మణివణ్ణన్,పి బాబు, టి హారోనిమస్ పాల్, కె అరుళానందం, ఎం అరుణ్‌కుమార్.

## రాసిపెట్టుకోండి.. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

హైదరాబాద్: రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. హైడ్రా పేరుతో ఇళ్లను కూలగొట్టి మహాపాపం మూటగట్టుకుం దని కేటీఆర్ అన్నారు.తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ప్రభుత్వమే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్అన్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు కేటీఆర్‌ను కలిసి ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలు, ప్రజాసమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతుల ను



చేసి, బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారు.

## అదంపూర్ ఎయిర్‌బేస్‌కు ప్రధాని మోదీ.. సైనికులతో ముచ్చట

పంజాబ్: అదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లిన ప్రధాని మోదీ.. ఎయిర్ ఫోర్స్ సిబ్బందితో ప్రధాని భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎయిర్‌ఫోర్స్ కీలక పాత్రపై మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఎయిర్ ఫోర్స్ సిబ్బందితో ముచ్చటించి వారిని అభినందించారు. పాక్‌కు ఇండియా ఎయిర్‌ఫోర్స్ సత్తా చూపించారంటూ ప్రశరలు కురిపించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని తొలిసారిగా నిన్న రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇవాళ పంజాబ్‌లో మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. పాక్‌పై మన సైనిక విజయాన్ని దేశంలోని ప్రతి తల్లికి, సోదరికి, కూతురికి అంకితం చేస్తున్నట్టు మోదీ నిన్న(సోమవారం) తన ప్రసంగంలో ప్రకటించారు. ఉగ్ర పోరులో మనతో కలిసి రావాల్సింది పోయి మనపైనే దాడులకు తెగబడింది. విచక్షణ కోల్పోయి మన సైనిక స్థావరాలతో పాటు విద్యా సంస్థలు, ప్రార్థనాల యాలు, ఇళ్లను కూడా లక్ష్యం చేసుకుందన్నారు. కానీ ఆ ప్రయత్నంలో ఘోరంగా విఫలమైంది... పాక్ డ్రోన్లు, క్షిపణులను మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఎక్కడివక్కడ నేలకూల్చింది. మనం అంతటితో ఆగలేదు. వాళ్ల సరిహద్దులపై దాడి చేస్తే నేరుగా పాక్ గుండెకాయకే గురిపెట్టాం. ప్రధాన నగరాల్లోని వాళ్ల కీలక సైనిక, వైమానిక



స్థావరాలన్నింటినీ నేలమట్టం చేశాం. పాక్ సైన్యానికి ఊహించలేనంత నష్టం మిగిల్చాం. ఆ క్రమంలో మన బలగాలు అంతులేని సామర్థ్యాన్ని, సంయమనాన్ని ఏకకాలంలో అద్భుత రీతిలో ప్రదర్శించాయి. మన దేశీయ ఆయుధ వ్యవస్థ తాలూకు పాటవాన్ని పూర్తిస్థాయిలో రుచిచూపాయి" అని ప్రధాని అన్నారు.

## నీరు, ఆహారం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించవద్దు..



హైదరాబాద్,మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన వన్యప్రాణి సంరక్షణ బోర్డు సమావేశం నేడు (మే 13)న జరిగింది. అడవుల్లో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, వన్యప్రాణి సంరక్షణ చర్యలపై రాష్ట్ర అటవీ, పర్యారణ, దేవాదాయ శాఖ మంత్రి సంబంధిత ఉన్నతాధికారుల సమీక్షలో చర్చించారు. రాష్ట్రంలోని వివధ జోన్ల సీసీఎఫ్ లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలతో స్టేట్ పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణతో కలసి మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే తెలంగాణ రాష్టవ్యాప్తంగా ఉన్న అడవుల్లో అగ్ని ప్రమాదం నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని అధికారులను ఆరా తీశారు మంత్రి సురేఖ. ఇంకా ఎక్కడైన ఒకేసారి పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా? లేదా? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు, ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలున్నాయి..? వాటి వల్ల వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని మంత్రి సురేఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా, వైల్డ్ లైఫ్ బోర్డు ఉన్నతాధికారులు అందుకు సంబంధించిన వివరాలను మంత్రికి తెలిపారు. వేసవి దృష్ట్యా అడవుల్లో, జూ లలో వన్యప్రాణుల, ఇతర జంతవులకు తగిన తాగునీటి సదుపాయాల కల్పన విషయాలపై ఆరా తీశారు మంత్రి. అయితే, ఈ వేసవిలో జంతువుల కోసం 2168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్టు మంత్రికి అధికారులు వివరించారు. నీటి గుంతల్లోకి నీటిని ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు తీసుకువస్తున్నట్టు అధికారులు తెలిపారు. నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. వన్యప్రాణులకు నీరు, ఆహారం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించద్దని మంత్రి సురేఖ ఆదేశాలు జారీ చేసారు. ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను (దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటికి ఆహారం అందజేయాలని మంత్రి సూచించారు.

## సంప్రదాయాలను దెబ్బతీస్తే సహించేది లేదు..

జన్నారం, మే13: కుల సంప్రదాయాలను దెబ్బతీస్తే సహించేది లేదని జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, పంచాయత్ రాజ్ మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీల మూడు రోజుల శిక్షణ ముగింపు మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్ లో మంగళవారం నిర్వహించగా, ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాదిగా ఆదివాసులు కుల, సంప్రదాయ కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదివాసుల హక్కుల కోసం పోరాడుతుందని, కాంగ్రెస్ తోనే అన్ని సాధ్యమైతాయని ఆమె చెప్పారు. అనాదిగా ఆదివాసీలు అడవుల్లో ఉంటూ ఆచార కట్టుబాట్లతో మెలుగుతున్నారని ఆమె తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాలరాస్తుందని, ఆర్ఎస్ఎస్ మను ధర్మాన్ని నమ్ముతుందని, ఆదివాసీలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని నమ్ముతారని ఆమె చెప్పారు. ఆదివాసీలను విద్యా, రాజకీయపరంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకువస్తూ చైతన్య పరుస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ జాతీయ కన్వీనర్ కొప్పు రాజు, ట్రై కార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య



నాయక్, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఏఐసీసీ జాతీయ కన్వీనర్ రాహుల్ బాల్, ప్రోగ్రాం ఇన్చార్జి రానాప్రతాప్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్, మాణిక్యం, పార్టీ సీనియర్ నేతలు జి.మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, ఎం.రాజశేఖర్, ఎస్పీరెడ్డి, అజ్మీర నందునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## క్వాలిటీ విషయంలో అసలు తగ్గొద్దు.. అధికారులకు సీఎస్ ఆదేశాలు..!



హైదరాబాద్,సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రభుత్వ సాంఘిక, గిరిజన, మైనారిటీ వసతి గృహాల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది.రాష్ట్రంలోని వివిధ సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ వసతి గృహాలలో మెరుగైన సేవలు అందించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు సీఎస్ రామకృష్ణారావు. విద్యార్థులకు అందించే కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్ లోకి జమ చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించడం వల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందని ఆయన అన్నారు. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడ నాణ్యమైన సరుకులు, విద్యార్థుల టెక్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్, బెడ్ షీట్లు, కార్పేట్స్, స్కూల్ బ్యాగ్స్ తదితర సామగ్రి సమకూర్చుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇక వారికి అందించే సరుకుల క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని, అందుకు తగ్గట్టుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులకు సూచించారు.

### కగార్ ఆగడంతో మావోలో దుశ్చర్య

భద్రాచలం,ఆపరేషన్ కగార్ ఆగిపోవడంతో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. జిల్లాలోని వేర్వేరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇన్ఫార్మర్ల నెపంతో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులను కిరాతకంగా హత్య చేశారు. ఒకే రోజు జరిగిన ఈ ఘటనతో ఆయా ప్రాంతాల్లోని ఆదివాసీలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఘటనలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇకపోతే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ఉసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా గత నెల 22 నుంచి 17 రోజుల పాటు- మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భారీ ఆపరేషన్ జరిగిన సంగతి తెలిసిందే. ఇక్కడి అటవీ ప్రాంతంలో మే 7న జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన 20 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న భద్రత బలగాలు.. వాటిని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియ ముగిసినట్లు-గా పోలీసులు సోమవారం వెల్లడించారు. 11 మృతదేహాలను కుటు-ంబ సభ్యులకు అప్పగించినట్లు- తెలిపారు.

## సంపాదకీయం

బుధవారం 14-05-2025

# సముచిత నిర్ణయాలు

స్వీయ లోటుపాట్లను సరిదిద్దుకోవటంలో న్యాయవ్యవస్థ సక్రమంగా వ్యవహరించటం లేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న రెండు నిర్ణయాలు ఎన్నదగి నవి. ఇప్పటికే 21 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించగా, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొన్న మార్చి 4న ఢిల్లీలోని తన అధికార నివాసంలో భారీ యెత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ లేఖ రాయటం కీలక పరిణామం. ఆ ఉదంతంపై విచారణకు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికనూ, జస్టిస్ వర్మ ఇచ్చిన ప్రత్యుత్తరాన్ని కూడా దానికి జతపరిచారు. అవినీతి మకిలి అంటిన న్యాయమూర్తుల్ని తొలగించటమనే ప్రక్రియ చాలా సుదీర్ఘమైనదీ,సంక్లిష్టమైనదీ. న్యాయమూర్తిపై ఆరోపణలొచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంత ర్గత విచారణ కమిటీని నియమించటం, అది ఇచ్చే నివేదికపై నిందపడిన న్యాయమూర్తి అభిప్రాయాన్ని కోరటం, ఆ తర్వాత అవసరమనుకుంటే రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయమని అడగటం రివాజుగా వస్తోంది. అందుకు నిరాకరిస్తే పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తారు. ఈ తీర్మానం కోసం ఇచ్చే నోటీసుపై లోక్‌సభలో కనీసం 150 మంది ఎంపీలూ, రాజ్యసభలో కనీసం 50 మందిఎంపీలూ సంతకాలు పెట్టాల్సివుంటుంది. ఆ తీర్మానాన్ని అనుమతించాలో లేదో స్పీకర్ లేదా రాజ్య సభ చైర్మన్ నిర్ణయిస్తారు. రాజ్యాంగంలోని 124, 218 అధికరణలు దుర్వర్తన లేదా అసమర్థత ఆరోపణల ఆధారంగా న్యాయమూర్తుల తొలగింపునకు అవకాశాన్నిస్తున్నాయి. అయితే ఇన్ని దశా బ్దాల్లో ఈ ప్రక్రియ కింద పదవిని కోల్పోయిన న్యాయమూర్తి ఒక్కరూ లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగని ఫిర్యాదుల సంఖ్య తక్కువేం లేదు. 2017%-%2021 మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ 1,631 ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. అయితే అంతర్గత విచారణ ప్రక్రియ రహస్యమైనది కావటంవల్ల ఎంతమంది న్యాయమూర్తులపై విచారణ జరిగిందో, ఎందరిపై చర్యలు మొదలయ్యాయో తెలియదు. తొలిసారి 1993లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిపై నిధుల దుర్వినియోగం విషయంలో వచ్చిన ఆరోపణల పర్యవసానంగా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ నడిచింది. అప్పట్లో ఆయనపై వచ్చిన 14 ఆరోపణల్లో పదకొండింటికి ఆధారాలున్నాయని తేల్చారు. తీరా పార్లమెంటులో అభిశంసన తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు కాంగ్రెస్ గైర్హాజర్ కావటంతో అది వీగిపోయింది. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీడీ దినకరన్‌పైనా ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగం వచ్చింది. అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన రాజీనామా చేయటంతో అది అర్ధాంతరంగా ముగిసింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వీరాస్వామిపై అవినీతి కేసులో సీబీఐ చార్జిషీటు నమోదు చేసింది. కానీ విచారణ ముందుకు సాగకుండా ఆయన అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు 2010లో ఆయన మరణించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వివరణనివ్వాలని కోరింది కూడా. కానీ ఇంతవరకూ అదేం జరగలేదు. అదే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎస్ఎన్ శుక్లా అవినీతిపై అంతర్గత కమిటీకి ఆధారాలు లభ్యమయ్యా యన్నారు. కేసుల విచారణ పని అప్పగించటం మానే శారు. కానీ ఆయన రిటైరయ్యేవరకూ న్యాయమూర్తిగా జీతభత్యాలు తీసుకుంటూనే వున్నారు. అందుకే అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యో గులూ, రాజకీయ పక్షాల నేతల మాదిరి న్యాయమూ ర్తులపై విచారణ సాగటం లేదన్న విమర్శలుంటున్నాయి. జస్టిస్ వర్మ వ్యవహారశైలి మొదటినుంచీ అనుమానాలకు తావిచ్చేదిగావుంది. మార్చి 14-15 రాత్రి అగ్నిప్రమాదం జరిగినప్పుడు కొన్ని కరెన్సీ కట్టలు తగలబడినా, మిగిలినవి సురక్షతంగా వున్నాయని మొదటగా అక్కడికొచ్చిన అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చెప్పగా... అటుపై బాగున్న కట్టలు మాయమయ్యాయి. దీనిపై జస్టిస్ వర్మ వివరణ సంతృప్తికరంగా లేకపోవటంతో వ్యవహారం అభిశంసన వరకూ వెళ్లింది. ఇప్పటికే కేసుల విచారణనుంచి ఆయన్ను తప్పించారు.నిజానికి జస్టిస్ వర్మ ఉదంతం ప్రభావంతోనే న్యాయవ్యవస్థపై నింద పడకూడదన్న ఉద్దేశంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో న్యాయమూర్తులు ఆస్తులు ప్రకటిస్తున్నా ఎవరైనా సమాచార హక్కు చట్టంకింద కోరితే తప్ప వివరాలు బహిరంగపరిచే విధానం లేదు. బ్రిటన్, కెనడాల్లోనూ అంతే. అయితే అమెరికా, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రష్యాల్లో చట్టప్రకారం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి.ఏదేమైనా జస్టిస్ సంజీవ్ ఖన్నా తాజా నిర్ణయం పారదర్శకత దిశగా ఒక కీలకమైన ముందడుగనే చెప్పాలి. అయితే నిందపడిన న్యాయమూర్తులను లోక్‌పాల్ చట్టం కింద విచారించవచ్చునా లేదా అన్నది ఇంకా తేలాల్సేవుంది. మొత్తానికి స్వీయప్రక్షాళనకు న్యాయవ్యవస్థ నడుం బిగించటంప్రశంసనీయమైన పరిణామం.

# ఆర్టీసీ చైర్మన్ ఇలాఖాలో డొక్కు..తుక్కు బస్సులే దిక్కు




మచిలీపట్నం:కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం.. ఇప్పుడు అభివృద్ధి దిశలో ఉరుకులు పరుగులు పెడ్తోంది. బందరు పోర్టు పనులు యమస్పీడ్ గా సాగుతున్నాయి. పోర్టు కోసం ఎదురు చూస్తున్న హైదరాబాద్ కూడా నేను సైతం అంటూ బందరుతో అనుబంధానికి సిద్ధమవుతోంది. నిమ్మకూరులో బెల్ కంపెనీ అప్పుడే పలకరిస్తోంది.ఇక అతి త్వరలోనే బందరు జనంతో కిటకిటలాడబోతోంది. ఇలాంటి స్థితిలో .. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పుట్టినూరు.. సొంత ఇలాఖా బందరులో ఆర్టీసీ పనితీరు మరీ దారుణంగా మారింది. ప్రైవేటు ట్రాన్స్ పోర్టర్లకు లాభం చేయటమే ధ్యేయంగా కాలం గడుపుతోంది. గత ఐదేళ్లల్లో తుప్పు పట్టిన, డొక్కు బస్సులతో కాలక్షేపం చేస్తూ.. ప్రయాణికులను దూరం చేసుకుంది. దగ్గర చేసుకునే ప్రయత్నం అసలు జరగటం లేదు.ఇటీవల జరిగిన రెండు ఘటనలను పరిశీలిస్తే.. బందరు ఆర్టీసీ అధికారుల స్వలాభేక్ష ఎంత దారుణంగా మారిందో అర్థం కాగలదు. మచిలీపట్నం నుంచి రెండు ఏసీ బస్సులను నడుపుతోంది. ఈ రెండు బస్సులూ.. ఏదోక సమస్యతో దారి మధ్యలో ఆగిపోతున్నాయి. గత మంగళవారం హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఇంద్రా ఏసీ బస్సు పిల్లలమర్రి ఏరియాలో ఆగిపోయింది.ఏసీ మిషన్ కు నీరు అందించే పైప్ పగిలిపోయింది. ఇక డ్రైవరు బాగుచేయటానికి విఫలయత్నం చేసి%ూ% కడకు డిపో అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఆ బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిని బందరు చేర్చటానికి సూర్యాపేటలోని ఆల్టర్ నేట్ బస్సును%ూ% కేవలం అరు కిలోమీటర్లలో ఆగిన ఇంద్రా బస్సు ప్రాంతానికి చేర్చటానికి అధికారులు గుంపుచింపులు పడ్డారు.పైగా హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న బస్సుల్లో ప్రయాణికులను పంపించాలని ఓ సలహా ఇచ్చారు. అప్పటికే డ్రైవరు ఈ ప్రయత్నాలు చేసి భంగపడ్డాడు. వేసవి సెలవులు కావటంతో ఏ బస్సూ ఖాళీగా లేదు. ఈ స్థితిలో విజయవాడ డిపో బస్సులు ఆగలేదు. ఎట్టకేలకు ఓ గంటన్నర వ్యవధిలో బందరు డిపో సూపర్ లగ్జరీ బస్సు వచ్చింది.ఇందులో 36 సీట్లే ఉన్నాయి. మిగిలిన నలుగురుని ఏ బస్సులో పంపించాలి? కానీ ఈ బస్సు పిల్లలమర్రిలో ఆగిన 15 నిముషాలకే ఏపీ 16 జెడ్ 0707 నైట్ రైడర్ బస్సు వచ్చింది. ఆ బస్సు డ్రైవరు కూడా ఇంద్రా బస్సు డ్రైవరుకు సాయం చేశాడు. లగ్జరీ బస్సు ఎక్కలేకపోయిన నలుగురిని తన బస్సులో బందరుకు చేర్చాడు.సరీగా 4.30 గంటలకు బయలు దేరిన ఈ రెండు బస్సులు బందరు చేరే సరికి 9.00 గంటలైంది. అంటే .. 1.30 గంటలు ప్రయాణికులు పడిన బాధ అంతా ఇంతా కాదు. అనవసరంగా ఆర్టీసీ బస్సు ఎక్కాం జనం తిట్టుకున్నారు. అంటే ఆర్టీసీ బస్సుపై జనానికి ఇంత ఏహ్య భావం ఎందుకు కలుగుతోంది?

ఇంద్ర ఆగిన మూడోరోజే.. నైట్ రైడర్ నరకం

ఇది సరేగురువారం రాత్రి హైదరాబాద్ లో బయలుదేరిన 0707 నైట్ రైడర్ బస్సు నందిగామ చేరుకునే సరికి.. మొరాయించింది. సుమారు 4.30 గంటలకు లైట్లు డిమ్ కొట్టాయి. క్రమంగా ఇంజన్ ఆగిపోయింది. అంటే బస్సులో కరెంట్ సప్లయి ఆగిపోయింది. ఈ బస్సులో 42 మంది ప్రయాణికులకు ఇక నరకం ప్రారంభమైంది. బందరు డిపో బస్సులన్నీ అప్పటికే కంచిక చర్ల చేరుకోవటంతో.. ఇక విజయవాడ బస్సులను ఆపి ఒక్కొక్క బస్సులో ప్రయాణికులకు విజయవాడకు చేర్చారు.ఈ స్థితిలో ఉయ్యూరు, పామర్రు ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. విజయవాడలో ఆ సమయంలో బందరు నాన్ స్టాప్ బస్సులే ఉంటాయి. ఆ తరువాత పల్లెవెలుగు బస్సులు లైన్ లోకి వచ్చిన తరువాత ప్రయాణికులు తమ గమ్యానికి చేరుకున్నారు.ఇక ఇబ్రహీంపట్నం డిపో నుంచి వచ్చిన మెకానిక్ మరమ్మత్తులు నిర్వహించి నైట్ రైడర్ ను 10.30 గంటలకు వదిలారు. ఇదండీ బందరు డిపో బస్సుల పరిస్థితి.కండీషన్ లేని బస్సులతో చెలగాటం బందరు డిపో అధికారులు కండీషన్ లేని బస్సులతో చెలగాటం ఆడుతున్నారని ఈ ఉదంతాలు ఓ ఉదాహరణ మాత్రమే. డిపో నుంచి బయలుదేరే బస్సు పరిస్థితిని ఎందుకు అంచనా వేయటం లేదు. డిపోలో బాగున్న బస్సు రోడ్డు ఎక్కిన తరువాత ఎందుకు ఆగిపోతుంది.తాగినోడే తాళ్ల పన్ను కట్టాలన్నట్టు.. బస్సు ఆగితే డ్రైవరు సరీగా తోలలేదని సర్టిఫికెట్టు ఇవ్వటం ఇక్కడ అలవాటుగా మారిందంటే కేవలం ఆరోపణ కాదు. అసలు డిపో మెకానిక్ పనితీరును ఎందుకు ప్రశ్నించరు? ఇంజన్ పికప్ ను తగ్గించి .. ఆయిల్ ఆదా చేస్తే సరిపోతుందా? రెండు లీటర్ల ఆదా కోసం ఇంత కక్కుర్తి అవసరమా? ఈ సంగతి పక్కన పెడితే.. డిపో అధికారుల ఆశలు అన్నీ ఇన్నీ కావు.ఆయిల్ వాడకం తగ్గాలి. జనం బస్సులు ఆక్యుపెన్సీ రేటు పడిపోయినాచేతికి డబ్బులు రాకపోయినా పర్వాలేదు. డిపోలో ఆయిల్ మిగిలితే చాలు. అటు ఆర్ ఎం, ఇటు డీఎం సంబరం పడిపోతారు. ఇక డిపోలో ఛీఫ్ మెకానిక్ .. హాయిగా కాలం గడిపేస్తారు. బస్సు ఆగితే.. తమ తప్పుకాదని డ్రైవర్లపై నెపం నెట్టేస్తారు. ఏళ్లకు ఏళ్లు ఇదే డిపోలో తిష్ట వేసి.. ఇక్కడ వచ్చే తాయిలాల కోసం తపించటానికి అలవాటు పడ్డారని ఆర్టీసీ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు.బందరు డిపోను దెబ్బతీసిందెవరు ? బందరు ఆర్టీసీ డిపో ఒకప్పుడు లాభాల బాటలో నడిచింది. చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం, పలాస ప్రాంతాలకు రెగ్యులర్ గా బస్సులు ఉండేవి. ఇక విజయవాడకు నాన్ స్టాప్ బస్సులు రయ్ రయ్ అంటూ తిరిగేవి. ఈ బస్సులన్నీ కిటకిటలాడేవి.ఇదేం ఖర్మమో? ఇప్పుడు ఆర్టీసీ బస్సులు ఎక్కడానికి బందరు జనం ఇష్టపడటం లేదు. ఎందుకంటే.. సుమారు 45 సర్వీసులను రద్దు చేశారు. చెన్నై, బెంగళూరు, తిరుపతి సహా.. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులన్నింటినీ రద్దు చేశారు. ఇలా రద్దు చేయటంతో ఎవరికి లాభం కలిగింది?బందరు కేంద్రంగా ప్రైవేటు ట్రావెల్స్ కు ఇబ్బడి ముబ్బడిగా జనం రద్దీ పెరిగిన మాట వాస్తవం కాదా? బందరు నుంచి చెన్నై, బెంగళూరు, కడప, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు ప్రైవేటు బస్సులు లాభాలతో నడుస్తుంటే.. ఆర్టీసీకి నష్టం ఎందుకు వచ్చింది? ప్రైవేటే బస్సులే జనానికి ఎందుకు దిక్కుగా మారాయి? ఒక్కసారి ఆర్టీసీ పెద్దలు పరిశీలించాలి.ఆర్టీసీ బస్సులో టిక్కెట్టు బుక్ చేద్దామంటే.. అవసరమైన సీట్లన్నీ బ్లాక్ చేస్తున్నారు. అదే మంటే ఎంపీలు, ఎమ్మెల్యే కోటాలని చెబుతున్నారు. నిజానికి ఏ ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సు ఎక్కుతున్నారు? కనీసం ఆర్టీసీ చైర్మన్ కూడా మచిలీపట్నం నుంచి విజయవాడ తన కార్యాలయానికి కారులోనే వెళ్తున్నారు. మరి వీరికి ప్రత్యేక కోటా దేనికి? ఆర్టీసీ ఆదాయానికి ప్రయాణికులు అవసరమా? ప్రజాప్రతినిధులు అవసరమా? కేవలం ఇలా సీట్లను బ్లాక్ చేస్తే.. తమకు అనుకూల సీట్ల కోసం జనం ప్రైవేటు బస్సులకు ఎగబడతారు. అంటే సీట్లను బ్లాక్ చేసి.. ప్రైవేటు ఆపరేటర్లకు ఆర్టీసీ అధికారులే తమ ఆదాయాన్ని వడ్డిస్తున్నారంటే ఆరోపణ కాదు.ఇక బందరు డిపో నుంచి నాన్ స్టాప్ బస్సుల నిర్వహణలోనూ అధికారుల ధోరణి పూర్తిగా విమర్శనాంశం. సాధారణ నాన్ స్టాప్ బస్సు ఎక్కితే విజయవాడ చార్జీ రూ.105 లు. అదే డీలక్స్ బస్సు ఎక్కితే రూ.135లు టిక్కెట్టు కొనాలి. ఆర్డనరీ బస్సుల కంటే డీలక్స్ బస్సులే ప్లాట్ ఫారం మీద ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక మధ్యలో సూపర్ లగ్జరీ బస్సులు కూడా నడుపుతున్నారు. ఈ నాన్ స్టాప్ బస్సులు ఎక్కితే.. ఫోర్ లైన్ ఎక్స్ప్రెస్ హైవేలోనూ సగటు వేగం 45 కిలోమీటర్లు మించదు. అదే మంటే భద్రత కోసం వేగం కంటే ప్రాణం మిన్నా అనే పేరుతో .. ఆయిల్ వినియోగం తగ్గించటానికి డిపో అధికారులు ఈ వ్యూహం అమలు చేస్తున్నారు.ఈ ప్రయాణాలకు విసుగు చెందిన ప్రయాణికులు రూ.100ల చార్జీతో టాటా ఏస్ వాహనాల్లో విజయవాడకు కేవలం గంటన్నరలో చేరుతున్నారు. ఇలా నాన్ స్టాప్ ల పేరుతో ఆదాయానికి గండి కొట్టారు. ఏసీ బస్సుల్లో మరీ దారుణం మచిలీపట్నం నుంచి హైదరాబాద్

# కవితకు పొగ పెడుతున్నది ఎవరు? కష్టపెడుతున్నది ఎవరు?



హైదరాబాద్, “ఆర్నెళ్లు జైల్లో ఉన్నది సరిపోదా%ూ% ఇంకా నన్ను కష్టపెడతారా? కొందరు పనిగట్టుకొని నాపై దుష్ప్రచారం చేస్తున్నారు.. సమయం వచ్చినపుడు అన్నీ బయటకు వస్తాయి.. నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా.. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తా.. నాపై జరుగుతున్న దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని అనుకుంటున్నా.. నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా.. ఉన్న పరిస్థితుల ఆధారంగానే సామాజిక తెలంగాణ అంశాన్ని ప్రస్తావించా”.. ఇవీ కల్వకుంట్ల కవిత చేసిన లేటెస్ట్ కామెంట్స్. ఈ డైలాగ్స్ సరిపోవా బీఆర్ఎస్‌లో కవితకు వ్యతిరేకంగా ఏ స్థాయిలో రాజకీయం నడుస్తోందో చెప్పడానికి. ఇంటి గుట్టును ఆమెనే రట్టు చేసేసింది. కవిత వ్యాఖ్యలు ఇప్పుడు గులాబీ పార్టీలో కాక రేపుతున్నాయి. కారు పార్టీలో కుంపటి రాజుకుందా? కవితకు పొగ బెడుతున్నది ఎవరు? ఆమెపై దుష్ప్రచారం చేస్తున్నది ఎవరు? కవితను సైడ్ చేస్తే ఎవరికి లాభం? కవిత ఎవరిని టార్గెట్ చేస్తున్నారు? ఇలా అనేక పాయింట్స్‌పై పొలిటికల్ డిబేట్ నడుస్తోంది.

కవిత ఒంటరి పోరాటం..

జైలు నుంచి వచ్చాక ఎమ్మెల్సీ కవిత ఒంటరి పోరాటం మొదలుపెట్టారు. గులాబీ జెండా నీడన కాకుండా.. తన తెలంగాణ జాగృతి గొడుగు కింద రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటు కోసం పెద్ద స్థాయిలో ఆందోళన చేస్తున్నారు. ధర్నాలు గట్రా చేస్తున్నారు. బీసీ వాయిస్‌తో ఉద్యమిస్తున్నారు. ప్రజలంతా సామాజిక తెలంగాణ కోరుకుంటున్నారంటూ సంచలన కామెంట్స్ కూడా చేశారు కవిత. సామాజిక తెలంగాణ కావాలంటే.. దొరల పాలన వద్దనేగా మీనింగ్? అంటే, మరోసారి కేసీఆర్ పాలన రాకూడదనేగా కవిత మాటలకు అర్థం? అని అంటున్నారు.

కవిత సొంత అజెండా?

కవిత చేస్తున్న ప్రతీ నినాదం బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టేదే అంటున్నారు. పదేళ్లు కేసీఆరే సీఎంగా ఉన్నారు. అప్పుడు ఎందుకు పెట్టలేదు పూలే విగ్రహం అనే ప్రశ్న గట్టిగా వినిపిస్తోంది. ఇది కేసీఆర్‌ను ఇరుకున పెట్టే విషయంగా మారింది. మరోవైపు, తెలంగాణ కుటుంబ సర్వేను కల్వకుంట్ల ఫ్యామిలీ మొత్తం వ్యతిరేకించింది. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు కులగణన సర్వేకు కుటుంబ వివరాలు ఇవ్వలేదు. కవిత ఒక్కరే తన ఫ్యామిలీ డీటైల్స్ ఇచ్చి కులగణనకు సహకరించారు. ఈ పరిణామంతో పార్టీలో, కల్వకుంట్ల కుటుంబంలో చీలిక వచ్చిందనే విషయాన్ని చెప్పకనే చెబుతోంది. అంటే, కేసీఆర్ ఫ్యామిలీలో కుమ్ములాటలు ఉన్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కవిత తన సొంత అజెండాతో రాజకీయం చేస్తున్నారని అంటున్నారు. కేటీఆర్, హరీష్‌రావులతో వేదిక పంచుకోకుండా.. జాగృతి జెండాతోనే ప్రజల్లోకి వెళ్లడాన్ని ఎలా చూడాలి? అన్నాచెల్లిల మధ్య పొలిటికల్ వార్ నిజమేనా?

అన్నాచెల్లి వార్?

కేసీఆర్ వారసుడు కేటీఆర్. గులాబీ దళం మొత్తాన్ని ఆ విధంగా ఫిక్స్ చేశారు. మొదట్లో హరీష్‌రావు ట్రై చేసినా.. ఆయనకు మంత్రి పదవి కూడా ఇవ్వకుండా సక్సెస్‌ఫుల్‌గా తొక్కేసి.. కేటీఆరే నెక్స్ట్ బాస్ అనే మెసేజ్ పార్టీ కేడర్‌కు బలంగా చాటారు గులాబీ దళపతి. అప్పటి నుంచి హరీష్ అడ్జస్ట్ అవుతున్నారు. కేటీఆర్ చాటు రాజకీయాలు చేస్తున్నారు. కవిత మాత్రం అలా కాదు. అన్నతో పోటాపోటీగా సై అంటున్నారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లొచ్చాక.. మరింత యాక్టివ్ అయ్యారు. అయితే, పార్టీ తరఫున కాకుండా సొంతంగా ఎదిగే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారని అంటున్నారు. ఈ క్రమంలోనే బీసీ నినాదం ఎత్తుకోవడం, పూలే విగ్రహం ఏర్పాటు.. సామాజిక తెలంగాణ స్లోగన్‌తో పక్కా యాంటీ బీఆర్ఎస్ పాలిటిక్స్ చేస్తున్నారనే వాదన అయితే ఉంది. ఇదే సమయంలో గులాబీ పార్టీలో కవితకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతోంది. ఆమె మీటింగ్స్‌కు, ధర్నాలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ వెళ్లకుండా పార్టీ పెద్ద కట్టడి చేస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయం గుర్తించిన కవిత.. గులాబీ అండా దండా జెండా లేకుండానే నెగ్గుకురావాలని, సొంతంగా ఎదగాలని ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. ఈ క్రమంలోనే పార్టీలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ లేటెస్ట్‌గా కవిత మండిపడ్డారు. ఆర్నెళ్లు జైల్లో ఉన్నది సరిపోదా.. ఇంకా నన్ను కష్టపెడతారా? రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తా.. అంటూ పార్టీకే వార్నింగ్ ఇచ్చారని.. పరోక్షంగా కేటీఆర్‌కే సవాల్ విసిరారని చెబుతున్నారు. మరి, అన్నాచెల్లిల వార్ ఫ్యూచర్‌లో ఏ టర్న్ తీసుకుంటుందో.

కాంగ్రెస్ కౌంటర్

ఎమ్మెల్సీ కవిత కామెంట్లపై కాంగ్రెస్ పార్టీ సైతం స్పందించింది. బీఆర్ఎస్ మూడు ముక్కలు, నాలుగు చెక్కలుగా మారబోతోందన్నారు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య. కవిత, హరీష్ రావులను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించాలని కేటీఆర్ చూస్తున్నారని చెప్పారు. గతంలో విజయశాంతి, ఆలే నరేంద్రలను పార్టీ నుంచి బయటకు పంపినట్లే కవితను కూడా బయటకు పంపుతారని అన్నారు. కరివేపాకులా కవితను చూస్తున్నారని.. పార్టీలో విలువ, గౌరవం లేకపోవడం వల్లనే కవిత అలా మాట్లాడుతున్నారని అన్నారు.

# వైసిపి శ్రేణలపై దాడులు తప్ప సాధించిందేమిటి?

కాకినాడ, వైసీపీ శ్రేణులపై దాడులు మినహా కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. మాజీ మంత్రి విడుదల రజనీపై పోలీసులు వ్యవహరించిన తీరుపై మండిపడ్డ ఆయన.. సీఐ సుబ్బారాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా వైసీపీ నేతలపై పెట్టిన కేసులు ఉపసంహరించండని, వైసీపీ నేతలను అణగద్రొక్కలనే ధోరణి మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమ అరెస్టులు చేస్తున్నారని జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ శ్రేణులపై దాడులు మినహా కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు. విడుదల రజనీపై పోలీసులు వ్యవహరించిన తీరు దారుణం. సీఐ సుబ్బారాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలి. అక్రమంగా వైసీపీ నేతలపై పెట్టిన కేసులు ఉపసంహరించండి. వైసీపీ నేతలను అణగద్రొక్కలనే ధోరణి మానుకోవాలి. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలుపై దృష్టి పెట్టండి. తల్లికి వందనం, ఉచిత బస్సు అంటూ పథకాలకు చరమగీతం పలికారు’ అని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తూర్పుగోదావరి జిల్లాలో మాట్లాడుతూ మండిపడ్డారు. రాష్ట్రంలో లాండ్ ఆర్డర్ పరిస్థితి దారుణంగా మారింది. రాష్ట్రంలో వైసీపీ శ్రేణులను అణిచివేయాలని చూస్తున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాజ్యాంగాన్ని చూస్తే బాబాసాహెబ్ అంబేద్కర్ మనస్సు కూడా ఆవేదన చెందుతుంది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమ అరెస్టులు చేస్తున్నారు. అరెస్టుల విషయంలో పోలీసులు తమనుతాము ప్రశ్నించుకోవాలి. మాజీమంత్రి విడదల రజనీ విషయంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదు. రానున్న ఎన్నికలలో వైసీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జక్కంపూడి రాజా పేర్కొన్నారు.

# నర్సుల సేవలు అనన్య సామాన్యం

గుంటూరు, వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో.. రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థయిర్యంతో పాటు సాంత్వన కలిగిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజక వర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో ఆయన సమావేశం అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిస్వార్ధంగా నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని ఆయన ప్రశంసించారు. విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు. మీరు పడే శ్రమ, కష్టం నాకు తెలుసు. కొవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన విధానం మరువలేం. ఇటీవల సింగపూర్‌లో నా కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి మీ కష్టం గుర్తుకువచ్చింది. మిమ్మల్ని కలసి మీరు అందించే సేవలు మరచిపోలేనివి అని చెప్పి కృతజ్ఞతలు చెప్పాలనుకున్నాను. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిసే అవకాశం రావడం ఆనందాన్నిచ్చింది. నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఇదిలావుంటే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. నర్సుల వృత్తికి గౌరవాన్ని, ఖ్యాతిని తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి, సేవ అమోఘమని కొనియాడారు. పేషంట్లను సొంత మనిషిలా చూసుకుంటూ.. అవసరమైన చికిత్సలో ఆసరాగా నిలుస్తున్న నర్సులు.. చిరునవ్వుతో, మానవత్వంతో సేవలందించే ప్రతి నర్సుకీ హృదయపూర్వక వందనాలు అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# అసలు ఏమిటి ఈ బ్రహ్మోస్?

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’లో ఉగ్రవాద స్థావరాలపై బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్‌ను ప్రయోగించినట్లు కనిపిస్తున్నది. రాజస్థాన్‌లోని బికనీర్ సమీపంలో ఈ క్షిపణికి సంబంధించిన మిసైల్ బూస్టర్, నోస్ క్యాప్ ఉన్నట్లు కొందరు గుర్తించారు. ఈ మిసైల్‌ను ప్రయోగించిన కాసేపటి తర్వాత కొన్ని విడి భాగాలను ఇండో-పాక్ సరిహద్దుల్లోని మారుమూల ప్రాంతంలో గుర్తించారు. పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో ఉన్న జైషే మహమ్మద్ ఉగ్రవాద నెట్‌వర్క్ హెడ్‌క్వార్టర్‌పై దీనిని ప్రయోగించినట్లు భావిస్తున్నారు. అయితే, ఈ విషయాన్ని భారత ప్రభుత్వం ధ్రువీకరించలేదు.

అసలు ఏమిటి ఈ బ్రహ్మోస్?

బ్రహ్మోస్ అనేది లాంగ్ రేంజ్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్. ఇది అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగలదు. ఇది ‘ఫైర్ అండ్ ఫర్గెట్ సూత్రం’ ఆధారంగా పని చేస్తుంది. లక్ష్యాన్ని చేరుకునే మార్గంలో రకరకాలుగా ఇది ప్రయాణిస్తుంది. కైనెటిక్ ఎనర్జీ (చలన శక్తి) భారీగా ఉండటం వల్ల లక్ష్యాన్ని విధ్వంసం చేసే సత్తా బ్రహ్మోస్ క్షిపణికి అత్యధికంగా ఉంటుంది. బ్రహ్మోస్ క్షిపణిని స్టెల్త్ టెక్నాలజీతో తయారు చేశారు. అంటే, దీనిని శత్రు రాడార్లు, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు, సోనార్ వంటి వ్యవస్థలు గుర్తించడం కష్టం. దీంతోపాటు అడ్వాన్స్‌డ్ గైడెన్స్ సిస్టమ్, దానిలోనే సాఫ్ట్‌వేర్ కూడా ఉంటుంది. అత్యంత కచ్చితత్వంతో, ప్రతికూల పరిస్థితుల్లో నిలదొక్కుకుని పని చేసే విధంగా ఈ క్షిపణిని రూపొందించారు. 290 కి.మీ. పరిధిలోని లక్ష్యాన్ని ఇది ఛేదించగలదు. ప్రయాణ కాలంలో మొదటి నుంచి చివరి వరకు సూపర్‌సానిక్ వేగాన్ని కొనసాగించగలదు. ప్రయాణ కాలం తక్కువగా ఉండేలా, లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించేలా, ప్రస్తుత రక్షణ వ్యవస్థలు అడ్డుకునే అవకాశాలు అతి కనిష్టంగా ఉండేలా తయారు చేశారు.

బ్రహ్మోస్ ప్రత్యేకతలు

రేంజ్ : 450 కి.మీ.కుపైగా (800 కి.మీ. వరకు వేరియంట్స్‌ను పరీక్షించినట్లు వార్తలు వచ్చాయి)

వేగం: సూపర్‌సానిక్ (మాక్ 2.8-3.0). ఫలితంగా దీనిని అడ్డుకోవడం చాలా కష్టం.

ప్రయోగ వేదిక: గగనతలం, భూతలం, సముద్రం, జలాంతర్గామి నుంచి ప్రయోగించవచ్చు. ఏఎల్‌సీఎం వెర్షన్‌ను ఎస్‌యూ-30ఎంకే నుంచి ప్రయోగించారు.

## రామాలయ భూముల్లో మదర్సా నిర్మాణం

సంగారెడ్డి, కిషన్‌గంజ్ పేరుతో జిన్నారం మదర్సాలో ఉంటున్నది ఎవరని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. జిన్నారంలోని కోదండ రామాలయం భూముల్లో అక్రమంగా మదర్సా నిర్మించారని ఆరోపించారు. జిన్నారంలో అక్రమ అరెస్టులపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన బీజేపీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిన్నారం మదర్సాపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ సరైన సమాధానం ఇవ్వకపోతే డీవోపీటీకి ఫిర్యాదు చేస్తానని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. రేవంత్ ప్రభుత్వం దేశ ద్రోహులకు మద్దతు ఇస్తుందా అని ప్రశ్నించారు. ఒక ఎంపీగా అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్, ఎస్పీ సరైన సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. జిన్నారం మత ఘర్షణలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తలను సోమవారం సంగారెడ్డి సెంట్రల్ జైల్లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు కలిశారు. ఈ సందర్భంగా రఘునందన్ మీడియాతో మాట్లాడారు. జిన్నారంలో అరెస్ట్ చేసిన వారి పట్ల రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. జిన్నారం వ్యవహారంపై జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. జిన్నారంలో ఏం జరుగుతుందో వెంటనే విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను నాలుగుసార్లు ఎంపీగా తాను అడిగినా సరైన సమాధానం ఎందుకు ఇవ్వలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. దేశద్రోహులను వెంటనే దేశం నుంచి పంపించాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసిన ఇప్పటికి అధికార యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. హిందువులను జైల్లో పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిన్నారం, పటాన్‌చెరు మదర్సాల్లో చదువు చెప్పడానికి ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. జిన్నారం వ్యవహారంపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వకపోతే హిందువులు విడుదలైన తర్వాత పోలీస్ స్టేషన్ నందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఏ కేసుల్లో వారిని అరెస్ట్ చేశారని నిలదీశారు. ఆ మదర్సా ఉనికి గురించి రేవంత్ ప్రభుత్వం వెంటనే స్పందించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కోరారు.

## రేషన్ కార్డులు ఇంకెప్పుడు?

హైదరాబాద్,అర్హులైన లబ్ధిదారులకు కొత్త కార్డులు మంజూరు చేస్తామని, కుమారుడు పెళ్లి చేసుకుంటే కుటుంబ యజమాని కార్డు నుంచి వేరు చేసి కొత్తగా మళ్లీ కార్డు మంజూరు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ జమానాలో కార్డులు ఇవ్వకపోవడంతో నిజమేనని నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ ఆశలు కల్పిస్తున్నదేగానీ.. కొత్త కార్డులు మంజూరు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాత వాటిలో పేర్లను తొలగించి, వారికి మళ్లీ కొత్త కార్డులు ఇవ్వడం లేదని చెబుతున్నారు. మార్చి నెలాఖరున సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని చెప్పారు. ఈ ఏడాది మే నెలలో స్మార్ట్ కార్డులు ఇస్తామంటూ మార్చి నెలలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ప్రకటనలే తప్ప కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కన్పిస్తే తిట్టిపోస్తున్నారు.

ఇదిగో ఇస్తున్నామంటున్న ఉత్తమ్

తెలంగాణలో పేదలకు (బీపీఎల్) లబ్ధిదారులకు ఇస్తున్న గులాబీ రంగు కార్డుల స్థానే గ్రీన్ కలర్‌తో రేషన్ స్మార్ట్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు నెలల క్రితం తెలిపారు. దారిద్ర్యరేఖకు ఎగువన (ఏపీఎల్) ఉన్న వారికి జాతీయ జెండాలోని మూడు రంగులతో స్మార్ట్ కార్డులు ఇస్తామని వివరించారు. గతంలో మాదిరి పేపర్ పుస్తకం మాదిరి కాకుండా ఎండకు ఎండిపోకుండా, వానకు తడవకుండా, ఎక్కడైనా సునాయసంగా వినియోగించుకునేందుకు వీలుగా స్మార్ట్ కార్డు డిజైన్ చేశామన్నారు. కార్డుపై కుటుంబ యజమాని పేరు మాత్రమే ఉంటుందని, అందులో మార్పులు, చేర్పులకు ఇబ్బంది ఉండదన్నారు. మీ సేవా కేంద్రం, తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు సమర్పిస్తే, పౌర సరఫరాల అధికారులు విచారణ జరిపి పేరు చేర్చడం, తొలగించడం జరుగుతుందని వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ కార్డు తరహాలో ఉండే రేషన్ స్మార్ట్ కార్డుల కోసం టెండర్లు ఆహ్వానించామని, మే నెల నుంచి లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలనే యోచనలో ఉన్నామని తెలిపారు. గత దశాబ్ధకాలంగా కొత్త కార్డులు ఇవ్వడం లేదని, పాత వాటిలో కనీసం పేర్లు కూడా చేర్చలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దరఖాస్తులు స్వీకరించి, వెరిఫికేషన్ కూడా పూర్తి చేశామని తెలిపారు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, పాతవారితో పాటు కొత్త లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు ఇస్తామని ఆయన అన్నారు. అయితే మంత్రి ప్రకటించిన ప్రకారం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మార్చి నెలాఖరున ముఖ్యమంత్రి చేతుల మీదుగా నూతన కార్డులు ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ ఇలా రెండు మూడు సార్లు వాయిదా వేశారు. ఎప్పుడు వీటిని ఇస్తారో తెలియడం లేదని ప్రజలు లబోదిబోమంటున్నారు.

ఏపీలో వాట్సాప్‌లోనే సేవలు

పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా కార్డు కావాల్సిన వారు గాభరా పడాల్సిన పనిలేదని, మన మిత్ర వాట్సప్‌లో దరఖాస్తు చేస్తే చాలని ప్రకటించింది. వీలు కానట్లయితే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అడిషన్, డిలీషన్, సరెండర్, అడ్రస్ చేంజ్, అప్డేట్ వంటి ఏడు రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఏపీ దూసుకుపోతుండగా తెలంగాణ పౌర సరఫరాల శాఖ మాత్రం ఇంకా బూజుపట్టిన విధానాన్ని అనుసరించడం దారుణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారంలో కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరిగారు. దరఖాస్తులు సమర్పించేందుకు అపసోపాలు పడ్డారు. ప్రతి దరఖాస్తు కోసం రూ.50 ఫీజు చెల్లించాలని ప్రభుత్వం సూచించింది. సాంకేతిక లోపాల కారణంగా ప్రజలు ఆర్థికంగా నష్టపోయారు. డబ్బులు చెల్లించినా స్వీకరించినట్లు రశీదులు ఇవ్వలేదు. కొన్ని మీ సేవా కేంద్రాలలో మాత్రమే దరఖాస్తులు స్వీకరించారు. ఆ మరుసటి రోజే మీ సేవలో దరఖాస్తులు స్వీకరించడం లేదని ప్రకటించి ప్రజాగ్రహానికి గురయ్యారు. ఆన్ లైన్ లో కాకుండా కార్యాలయాలకు వెళ్లి అందచేయాలని సూచించింది. అయితే ఇంతకు ముందు గ్రామ సభల్లో, ప్రజా పాలన, ప్రజావాణిలో అప్లికేషన్లు ఇచ్చినవారు మళ్లీ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఒక్క రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచే సుమారు 2 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి అంటే మిగిలిన 8 జిల్లాల నుంచి అంతకు రెట్టింపు సంఖ్యలో నమోదు అయ్యే అవకాశం ఉంది. జిల్లాల వారీగా ఎన్ని దరఖాస్తులు అందాయి, ఎన్నింటిని వెరిఫికేషన్ చేశారు, తిరస్కరించినవి ఎన్ని అనే వివరాలను ఇప్పటి వరకు పౌర సరఫరాల శాఖ అధికారికంగా ప్రకటించలేదు. కాగా అందిన దరఖాస్తులను వడపోశామని, స్మార్ట్ కార్డుల పంపిణీ కోసం టెండర్లు పిలిచామని, మే నెలలో కొత్త వారితో పాటు పాత లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. అయినా ఇప్పటి వరకు ఈ దిశగా ఏం చర్యలు తీసుకుంటున్నారు, ఎప్పటి నుంచి ఇస్తారనేది స్పష్టత ఇవ్వడం లేదు.

# రేవంత్‌పై బీఆరెస్ నేతల ముప్పేట దాడి.. మంత్రుల మూతికి తాళం వెనుక!



హైదరాబాద్,ఎన్నికలకు ముందు, ప్రభుత్వం ఏర్పడిన కొత్తల్లో రేవంత్‌రెడ్డిని బీఆరెస్ నాయకులు విమర్శిస్తే.. అంతే స్థాయిలో కాంగ్రెస్ నేతలు రియాక్టయ్యేవారు. కానీ.. ఈ మధ్య కాలంలో రేవంత్‌ను కేటీఆర్, హరీశ్, కవిత టార్గెట్ చేస్తూ, పరుష పదజాలంతో దూషిస్తున్నా.. ఇదేదో రేవంత్ జవాబు చెప్పుకోవాల్సిందేనన్నట్టుగా మంత్రుల వ్యవహారం కనిపిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ముఖ్య నాయకులు కే తారక రామారావు, టీ హరీశ్ రావు, కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సూటిపోటి మాటలతో ముప్పేట దాడి చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో హద్దులు దాటి పరుష పదాలతో విరుచుకుపడుతున్నారు. ఇటు సోషల్ మీడియాలో, అటు ప్రచార ప్రసార సాధనాల్లో ఎగతాళి మాటలు సంధిస్తున్నా ఏ ఒక్క మంత్రి కూడా దీటుగా తిప్పికొట్టేందుకు ప్రయత్నం చేయకపోవడం రాజకీయంగా ఆసక్తి రేపుతున్నది. ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ నాయకులు ఘాటుగా స్పందిస్తున్నా, అవి ప్రజల్లోకి వెళ్లడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తే మంత్రులు ఒంటికాలిపై లేచి ప్రతి విమర్శలు చేసేవారు. ఇప్పుడా తెగువ ఏ ఒక్క మంత్రిలో కన్పించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తిట్టేది మమ్మల్ని కాదు కదా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కదా? అనే తృణీకరణ భావం పలువురు మంత్రుల్లో కనిపిస్తున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. తిట్లు పడుతున్న రేవంత్‌రెడ్డే నోరు పెంచుకోవాలనే విధంగా వారి వ్యవహారం కనిపిస్తున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మంత్రుల్లో నైరాశ్యం వల్లేనా?

తెలంగాణ కాంగ్రెస్ సర్కార్‌లో అమాత్యుల నైరాశ్యం పెరుగుతోంది. మంత్రి పదవులు ఇచ్చి, కీలకమైన శాఖలు ఇచ్చినా వాటిపై పట్టు పెంచుకునే ప్రయత్నం చేయడం లేదు. 'తమ సీనియారిటీని గుర్తించి ఇచ్చారని కొందరు, పార్టీని నమ్ముకున్నందుకు పదవులు వచ్చాయని కొందరు ఇలా ఎవరికి వారు తమ అర్హత మేరకేనని ఊహించుకుంటున్నారు. కానీ రేవంత్ రెడ్డి అంగీకారంతో తమకు పదవులు వచ్చాయని మెజారిటీ మంత్రులు అనుకోవడం లేదు' అని ఒక సీనియర్ జర్నలిస్టు వ్యాఖ్యానించారు. అమాత్యుల నిర్లిప్తత, మొక్కుబడిగా ప్రతిస్పందించడాన్ని ప్రధాన ప్రతిపక్ష నాయకులు అలుసుగా తీసుకుని వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆయన అన్నారు. 'ఇక నుంచి కేసీఆర్‌ను దూషిస్తే నీ నాలుక చీరేసే రోజు వస్తుంది.. తప్పకుండా గుర్తు పెట్టుకో' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పరుషంగా విమర్శించారు. 'సర్కార్ నడపలేని సన్నాసి', 'అహంకారం', 'యాక్సిడెంటల్ సీఎం', 'పేమెంట్ కోటాలో పదవి దక్కడంతో కళ్లు నెత్తికెక్కాయి' అనే విమర్శలు మొదలుకుని.. 'మందికి పుట్టిన బిడ్డని మా బిడ్డ అని చెప్పుకునే బాపతు', 'తాను చనిపోయే నాటికి తన మీద బీజేపీ జెండా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీకి రేవంత్ మాట ఇచ్చారు' అంటూ కేటీఆర్ చెలరేగిపోయారు. 'నేను మంత్రి అయిన రోజు నా కారు ముందు డ్యాన్స్ చేసినోడివి, బీఆర్ఎస్ పొత్తుతోనే ఎమ్మెల్యేవి అయ్యావు..' అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్ రావు నిప్పులు చెరుగుతున్నారు. రేవంత్ రెడ్డి ఆరెస్సెస్ సీఎం అని.. ప్రధాని మోదీ డైరెక్షన్‌లో పనిచేస్తున్నారంటూ.. తానేమీ తక్కువ కాదన్న రీతిలో కేసీఆర్ పుత్రిక, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిట్లు అందుకున్నారు. ఒకటి గమనిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇతరులపై కంటే ఒక్క రేవంత్‌రెడ్డినే టార్గెట్ చేసుకున్నారని స్పష్టమవుతున్నదనే అభిప్రాయాలు ఉన్నాయి.

పార్టీలోనూ ప్రభుత్వంలోనూ రేవంత్ టార్గెట్

పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పనిచేసిన సయమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఎలాగైతే వ్యక్తిగతంగా విమర్శలు, ఎగతాళి చేశారో ఇప్పుడు కూడా అదే విధంగా ఆయన లక్ష్యంగా పరుష పదాలతో విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సీటుకు గౌరవం ఇస్తూ సున్నితంగా తిట్టే అవకాశం ఉన్నా ఆ పని చేయడం లేదు. అదేమంటే ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మా నాయకుడు కేసీఆర్, మా పై ఘాటుగా మాట్లడలేదా అని సమర్థించుకుంటున్నారు. ఏది ఏమైనా రాజకీయ విమర్శలు వేరు.. తిట్లతో సాగే విమర్శలు వేరు. ఎన్నడూ లేని స్థితిని ఇప్పుడు చూస్తున్నామనేది మాత్రం వాస్తవం. హుందాగా సాగిపోయే రాజకీయాల్లో ఈ తిట్ల పురాణాలను పుట్టించిందెవరో అందరికీ తెలుసని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పట్లో కేసీఆర్ తిట్టడం మొదలు పెడితే.. పొట్టపొట్ట తిట్లు పడేసేవారు. దానికి కౌంటర్‌గా మొదలైన ఎదటిపక్షం తిట్లు.. భరించే స్థితిలో బీఆరెస్ నేతలు లేరన్న విషయం అర్థమవుతూనే ఉన్నది. దీని సంగతి పక్కనపెడితే.. బీఆర్ఎస్ ముఖ్యనాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత ముఖ్యమంత్రిపై చేసే వ్యక్తిగత విమర్శలకు మంత్రులు అదే స్థాయిలో స్పందించడం లేదనేది మాత్రం కనిపిస్తున్న వాస్తవం. 'నన్ను దూషించ లేదు కదా, రేవంత్ ను తిట్టారు కదా, ఆయనే చూసుకుంటారులే' అనే భావనతో మెజార్టీ మంత్రులు మౌనంగా ఉన్నారనే అభిప్రాయాలు రాజకీయ పరిశీలకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ మీడియా సమావేశం పెట్టినా మొక్కుబడిగా మాట్లాడి మమ అనిపించేలా ఆ విమర్శలు ఉంటున్నాయి.

నాటి దూకుడేది?

ప్రభుత్వం ఏర్పాటు అయిన కొత్తలో మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క ఘాటుగా, దీటుగా తమదైన శైలిలో మీడియా సమావేశాలు నిర్వహించి, బీఆర్ఎస్ నేతలపై దుమ్ము దులిపేవారు. ఎక్కడ కూడా తగ్గకుండా అదే స్థాయిలో ప్రతిస్పందించేవారు. అయితే ఇప్పుడా దూకుడు, దుమ్ము దులుపుడు తగ్గించి నిర్లిప్తంగా ఉంటున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి పదవులు తమ నియోజకవర్గం కోసమే అన్నట్లుగా చక్కబెట్టుకుంటున్నారు. కనీసం జిల్లా స్థాయిలో కూడా తమ పలుకుబడిని ఉపయోగించి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గ ప్రజలకు గోస వస్తే తమకు కష్టం వచ్చినట్లుగా చకచకా అధికారులను పురమాయించి పూర్తి చేయించుకుంటున్నారు. వీళ్లు నియోజకవర్గం మంత్రులా? రాష్ట్రానికి మంత్రులా? అనే చర్చ కాంగ్రెస్ కార్యకర్తల్లోనే నడుస్తున్నది. రేవంత్ రెడ్డికి మంత్రుల బలం లేదనేది బీఆర్ఎస్ ముఖ్య నేతలు గమనించి, దాడిని తీవ్రం చేస్తున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

వారి స్థాయి సరిపోవడం లేదు..

సీఎం రేవంత్ రెడ్డిపై చేసే విమర్శలను ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, ఆది శ్రీనివాస్, ఎంపీ చామల కిరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వంటివారు తిప్పికొడుతున్నా జనం అంతగా స్వీకరించడం లేదు. చోటా మోటా నాయకులు మాట్లాడుతున్నారంటూ ప్రజలు టీవీ చానల్ మార్చేస్తున్నారు. వ్యక్తిగత విమర్శలను సీఎం తిప్పికొట్టిన సందర్భాల్లో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు, పత్రికల్లో చదువుతున్నారు. తనపై వచ్చిన అభాండాలకు తానే సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితులు అప్పుడూ ఇప్పుడూ ఉన్నాయి. ఇక మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బీఆర్ఎస్ చౌకబారు విమర్శలను తిప్పి కొడుతున్నారు. కానీ రేవంత్ రెడ్డి పై చేసిన వ్యక్తిగత దూషణలపై తీవ్రంగా ప్రతిస్పందించడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ పై, రాహుల్ గాంధీ పై విమర్శలు చేసిన సందర్భంలోనే కొంత కఠినంగా బదులిస్తున్నారు. ఎందుకిలా వ్యవహరిస్తున్నారనేది కాంగ్రెస్ కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది.

# ట్రంప్ నమ్మదగిన అధినేత కాదు !



న్యూఢిల్లీ,పపంచంలో ఇప్పటకే రెండు యుద్ధాలు కొనసాగుతున్నాయి. వాటిని నివారించే ప్రయత్నంలో టకరంప్ విఫలం అయ్యారు. ఎన్నికల ప్రచారంలోయుద్ధ నివారణకు కృషి చేస్తానని ట్రంప్ చేసిన హామీ విఫలం అయ్యింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ట్రంప్ అపలేక పోయారు. సరికదా ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేసింది. అలాగే పాలస్తీనాపై ఇజ్రాయిల్ విరుచుకు పడుతోంది. అక్కడా ఇజ్రాయిల్‌కు అమెరికా ప్రత్యక్ష మద్దతు కొనసాగుతోంది. ఇజ్రాయల్ కూడా హమాస్ ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా యుద్ధంచేస్తోంది. ఈ యుద్ధాన్ని కూడా ఆపేందుకు ట్రంప్ ప్రయత్నించలేదు. భారత్ -పాక మధ్య అసలు యుద్ధమే మొదలు కాలేదు. కేవలం కాల్పులు మాత్రమే సాగుతున్నాయి. భారత్‌పై ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. వందమంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. అందులో భారత్ కోరుతున్న ఉగ్రవాదులు కూడా ఉన్నారు. కానీ ఎక్కడా జనావాసలు లక్ష్యంగా దాడులకు దిగలేదు. కానీ దీనికి ప్రతిగా పాకిస్థాన్ జనావాసాలు లక్ష్యంగా దాడులకు తెగబడింది. ఈ క్రమంలో భారత్ పాక్ ఎయిర్ బేస్‌లు మొదలు అనేక చోట్ల దాడులు చేయడంతో పాటు, పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టింది. కేవలం ప్రతిదాడులకు మాత్రమే భారత్ దిగింది. ఇక్కడ యుద్ధం అన్నదే లేదు. మరి డోనాల్డ్ ట్రంప్ ఇరు దేశాల్లో జోక్యం చేసుకుని యుద్ధ నివారణకు చర్యలు తీసుకున్నానని ఎలా చెబుతారు. పాక్ ఉగ్రవాదంలో అమెరికా కూడా నష్టపోయింది. ఈ తరుణంలో పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇప్పించాల్సిన అవసరం ఏముందు. ట్రంప్‌కు ఎందుకు ఇక్కడ జోక్యం చేసుకోవాలని అనిపించిందన్నది ముందుముందు తేలనుంది. ఇకపోతే కాశ్మీర్ గురించి, భారత్ గురించి మాట్లాడే సమయంలో చరిత్ర కూడా తెలియకుండా ట్రంప్ అతితెలివితో వ్యవహరించారు. కాశ్మీర్ సమస్యల వెయ్యేళ్ల నుంచి ఉందని అంటూ తన డొల్లతనాన్ని బయటపెట్టుకున్నారు. నిజానికి కాశ్మీర్ సమస్య పరిష్కరించాలని భారత్ ఏనాడూ ఎవ్వరినీ కోరలేదు. భారత్- పాకిస్తాన్‌తో తమ వాణిజ్యాన్ని మరింత పెంచుకుంటామని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చెప్పడంలోనే ఈ తతంగం ఉందని అర్థం చేసుకోవచ్చు. తమ జోక్యంతోనే ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ సాధించామంటూ గొప్పలు చెప్పుకున్న ట్రంప్..అమెరికా అసలు లక్ష్యమేంటో ఆదివారం మరో ప్రకటన ద్వారా వెల్లడించారు. వెయ్యేళ్ల కాశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తాము మధ్యవర్తిత్వం వహిస్తామని చెప్పారు. ఓ దేశ అధ్యక్షుడు మరో దేశ సమస్య గురించి తెలియక పోవడం దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. అదే సమయంలో భారత్, పాక్ దేశాలతో వాణిజ్య అవకాశాలను గణనీయం గా పెంచుకుంటామని అసలు విషయాన్ని నిస్సిగ్గుగా అదే ప్రకటనలో వెల్లడించారు. కేవలం తన వాణిజ్య అవసరాల కోసం పాక్, భారత్‌లను వాడుకుంటానని చెప్పినందున మనం ట్రంప్ వ్యయహారశైలి పైనా అప్రమత్తంగా ఉండాల్సిందే. మధ్యవర్తిత్వం పేరిట జోక్యాన్ని పెంచుకొని అనేక దేశాల మధ్య ఆరని చిచ్చులా ఘర్షణలు రాజేసిన అమెరికా ఇప్పుడు భారత్, పాక్ విషయంలోనూ అదే ప్రయత్నం చేస్తోందని గుర్తించాలి. ట్రంప్ తాజా పోస్టుపై భారత్ ప్రభుత్వం, అమెరికా విదేశాంగ శాఖ కూడా స్పందించలేదు. అయితే 'వెయ్యి సంవత్సరాల' భారత్-పాకిస్తాన్ వివాదం గురించి ట్రంప్ తప్పుగా ప్రస్తావించడం ఇదే మొదటిసారి కాదు. 2019లో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించడానికి సహాయం చేయమని ప్రధాని మోడీ అభ్యర్థించారని ట్రంప్ తెలిపారు. అయితే అప్పట్లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో దీన్ని ఖండించింది. ఇలాంటి వ్యక్తి అమెరికాకు మరోమారు అధ్యక్షుడు అయ్యాక ఇటీవల అనేక గందరగోళ చర్యలు తీసుకున్నారు. దీంతో అమెరికాలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు.ట్రంప్ తీరును దుయ్యబట్టారు. ఈ క్రమంలో మనం మన జాగ్రత్తల్లో ఉండాల్సిందే. ట్రంప్ చెప్పాడని పాక్‌ను నమ్మితే ప్రమాదమని గుర్తించాల.ఇ పహల్గాంలో భారత మహిళల సిందూరాన్ని నేలరాల్చిన పాక్ ముష్కరుల స్థావరాలపై భారత సైనిక, వైమానిక, రక్షణ దళాలు క్షిపణులతో అగ్నివర్షం కురిపించాయి. ఉగ్రవాదంపై ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరిట జరిపిన మహోగ్ర దాడిలో పాకిస్థాన్‌గడ్డపై ఇష్టారాజ్యంగా నడుపుతున్న ఉగ్రవాద శిక్షణా స్థావరాలు సమూలంగా ధ్వసం అయ్యాయి. లక్ష్యాలను ఛేదించడంలో,శత్రుస్థావరాలను నేలమట్టం చేయడంలో మన సైనిక దళాల పాటవానికి 'సిందూర్' నిలువుటద్దంగా నిలిచింది. ఒకేసారి తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై గురిపెట్టి గట్టిగా చావుదెబ్బ కొట్టడంతో పాక్ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఇలా గత నాలుగైదు రోజులుగా మన దళాలు చేసిన దాడులతో పాక్ దిమ్మతిరిగి పోయింది. మన సత్తా ఏమిటో తెలిసింది. అలాగే చైనా, అమెరికా ఆయుధాలు ఎలా పేలిపోయాయో చూశాం. ఎఫ్-16లను కూడా మన వాయుసేన కుప్పకూల్చింది.భారత రక్షణ దళాలు మొత్తం తొమ్మిది లక్ష్యాలను ఎంచుకోగా అందులో ఐదు పాక్ భూభాగంలో, మిగిలిన నాలుగు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నాయి. ఉగ్రదాడులకు పథకాలు వేసే, ఆ దాడులను నిర్దేశించే ప్రదేశాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపించినట్టు రక్షణశాఖ వెల్లడించడం విశేషం.

## ఆక్వాకల్చర్ శాస్త్రవేత్త ఆత్మహత్య

బెంగళూరు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్) మాజీ డైరెక్టర్ జనరల్, ప్రముఖ ఆక్వాకల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బన్న అయ్యప్పన్ (69) శ్రీరంగపట్నంలోని కావేరి నదిలో శవమై కనిపించారు. ఆయన కనిపించడం లేదని ఆయన బంధువులు రెండు రోజుల క్రితం విద్యారణ్యపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చేపల ఉత్పత్తికి సంబంధించిన నీలి విప్లవంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫ్రెష్‌వాటర్ ఆక్వాకల్చర్ డైరెక్టర్ మరియు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ చైర్మన్ వంటి పదవులను ఆయన నిర్వహించారు. 2022లో దేశం ఆయనను పద్మశ్రీతో సత్కరించింది. డాక్టర్ సుబ్బన్న అయ్యప్పన్ మైసూరులోని విశ్వేశ్వర నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని అక్కమహాదేవి రోడ్డులో నివసిస్తున్నారు. ఆయన స్కూటర్ నది ఒడ్డున దొరికింది. ప్రాథమిక దర్యాప్తులో అతను మూడు రోజుల క్రితం శ్రీరంగపట్నంలోని సాయిబాబా ఆశ్రమం సమీపంలోని నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. డాక్టర్ ఎస్ అయ్యప్పన్ మూడు రోజుల క్రితం తన ఇంటి నుండి బయటకు వెళ్లారు. అతను తిరిగి రాకపోవడంతో, అతని కుటుంబ సభ్యులు పోలీసులకు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. తరువాత పోలీసులు గాలింపులు చేపట్టగా కావేరి నదిలో ఆయన మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం మైసూర్‌లోని కెఆర్ ఆసుపత్రికి తరలించారు. మరణానికి కారణం ఇంకా స్పష్టంగా తెలియలేదు.

## ఈటెలకు మతి తప్పింది

హైదరాబాద్, ఈటెల రాజేందర్ ముందు నీ పిచ్చి వాగుడు కట్టి పెట్టి.. ఈ పిచ్చి ప్రేలాపనలు ఆపు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇంత కాలం రాజకీయాల్లో ఉండి చివరకు ఈ స్థితికి వస్తావని మేం అనుకోలేదని,ఈటెల రాజేందర్, మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈటెల మర్యాదస్తుడు అనుకున్నాం.. కానీ, ఆయనకు మతి తప్పిందని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలంటే మీ అధిష్టానాన్ని కాక పట్టుకో.. కానీ మా ముఖ్యమంత్రిని బూతులు తిడితే పదవి వస్తుందనుకోవడం నీ అవివేకానికి నిదర్శమని ఆయన అన్నారు. శాడిస్ట్, సైకో అని మాట్లాడావు.. మాకు అంతకు మించిన మాటలు కూడా వచ్చు.. అది గుర్తు పెట్టు-కో అని అన్నారు. 30 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉండి నా కొడకా అన్న పదాలు వాడుతున్నవంటే నీ మానసిక స్థితి అర్థమవుతూనే ఉందని, నీ నీచ రాజకీయం కోసం మా ముఖ్యమంత్రి పైన దిగజారుడు భాష ఉపయోగిస్తే మాత్రం సహించమని ఆయన అన్నారు. మీరు నీచ భాష ఆపకపోతే మేం అంతకు మించిన భాషను వాడాల్సి వస్తోందని ఆయన అన్నారు.

## బిఆర్ఎస్,బిజెపిలు రెండూ ఒక్కటే

ఖమ్మం,బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని, లోపాయకారిగా వారి వ్యవహారాలు ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒకరి స్క్రిప్టును మరొకరు చదువుతారని అన్నారు. జిల్లా అభివృద్ధిలో తాము చేపట్టిన కార్యక్రమాల గురించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రస్తావిస్తూ, బీజేపీ-బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రమైన విమర్శలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని అన్నారు. ఒకరు స్క్రిప్ట్ రాస్తే మరొకరు మాట్లాడతారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష పాత్ర పోషించడంలో తప్పులేదు. కానీ విమర్శలు చేస్తే వాటికి నిజాయితీ ఉండాలి. ప్రజలు అన్నం తినలేదన్నట్టు- బిల్డప్ ఇవ్వడం తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మంత్రి.. సీతారామ ప్రాజెక్టుకు కరెంట్ కూడా ఇవ్వలేని స్థితిలో ఉండే ప్రభుత్వం ప్రజల అవసరాలపై ఎంత చిత్తశుద్ధితో పని చేసిందో చెప్పకనే చెప్పిందని అన్నారు. భూమికి బదులుగా భూమి ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, కానీ తాత్కాలికంగా నగదు రూపంలో సాయం అందిస్తున్నామన్నారు మంత్రి పొంగులేటి. రెండు మూడు రోజుల్లో అందరికీ సాయం అందుతుంది. స్థలాలు పోతున్న వారికి పరిహారం ఇచ్చేలా ఏర్పాట్లు- చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బలహీనంగానే ఉన్నా, సుమారు రూ.680 కోట్లతో 16-17 కిలోమీటర్ల రి-టైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇప్పటికే 9 కిలోమీటర్ల పనులు మొదలయ్యాయి. రెండు పక్కల డ్రెయిన్, బీటీ- రోడ్ కూడా నిర్మిస్తున్నారు అని అన్నారు. గత ఆగస్టులో మున్నేరు వాగు పరివాహక ప్రాంతాల్లో వేలాది కుటు-ంబాలు వరదల్లో ఇబ్బంది పడ్డాయని, సీఎం రేవంత్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నేను, భట్టి విక్రమార్క కలిసి ఐదు ఆరు రోజులు అక్కడే పర్యవేక్షించా మన్నారు. ఈ ప్రభుత్వం, గత ప్రభుత్వాలాగా జీవో ఇవ్వడంలో కాదు.. పనులు మొదలు పెట్టడంలో నిబద్ధత చూపుతోంది అన్నారు. ఇల్లు కోల్పోయిన పేదలకు స్థలాలు, ఇళ్లు అందిస్తాం. ఇరిగేషన్ భూములు ఉన్నవారు వాటిని ఇవ్వాలి. ప్రభుత్వంలో ఉద్యోగులు కూడా మా కుటుంబ సభ్యులేనని అన్నారు. సమస్యలను ఒప్పుకోకుండా ఎదుర్కోవడం సరైన పద్ధతి కాదు అని వ్యాఖ్యానించారు.

## హైడ్రా దూకుడుతో పేదలు ఆగం

హైదరాబాద్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా మండిపడ్డారు. హైడ్రాతో ముఖ్యమంత్రి దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 1965లో అల్వాల్ లో 50 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఓ కాలనీ ఉంది.. ఈ కాలనీకి ఇంటింటికీ నోటీసులు ఇవ్వడమే కాకుండా.. చివరికి గుడులకు కూడా నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఒక తరం త్యాగం చేస్తే.. రెండో తరం ఇల్లు కట్టుకుంది.. మూడో తరం చదువుకుంటోంది అని గుర్తు చేశారు. బాలాజీ నగర్, అరుంధతి నగర్ లో ఇలా ఉంది పరిస్థితి.. ఇక, ప్రజల జీవనంలో మంచి మార్పు వస్తదని ముఖ్యమంత్రిని చేస్తే.. నేను ఎవరు చెప్పినా వినను.. నాకు నేను నిర్ణయం తీసుకుంటానంటున్నాడు.. హైడ్రా పేరుతో పక్కా ఇల్లు కూలగొట్టుడే.. అడ్డమొచ్చిన వాళ్లను బుల్డోజర్లతో తొక్కవలసిందే అన్నట్లుగా రేవంత్ రెడ్డి స్టేట్ మెంట్ ఇస్తున్నాడని ఎంపీ ఈటల అన్నారు. ఇంటెలిజన్స్ వ్యవస్థ అయినా ఇక్కడి ప్రజల పరిస్థితి చెప్తుంటరు కదా.. అయినా సీఎం రేవంత్ ఎందుకు వినడం లేదని బీజేపీ ఎంపీ ఈటల ప్రశ్నించారు. ఎవరు చెప్పినా వినని వారిని నాయకుడు అనరు.. సైకో అంటారని విమర్శించారు. ఇక, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బాధపడుతూ.. ఆత్మహత్య చేసుకు ంటుంటే.. నవ్వే వాళ్లను సైకో అంటారు.. కోర్టుల్లో అడ్వకేట్లు- వాదిస్తరు.. అంతిమ న్యాయనిర్ణేత జడ్జిది ఉంటది.. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ కర్తవ్యం ఆ పార్టీకి ఉంటది.. ఆయా పార్టీల ఎజెండా ఆయా పార్టీలకు ఉంటది.. కానీ, అంతిమంగా న్యాయ నిర్ణేతలు ప్రజలే ఉంటారు అని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్,నగరంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు-చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన అమన్‌జైన్(32), తన భార్యతో కలిసి కోకాపేటలోని మైహోం అపార్టుమెంట్స్ లోని ఒకటో టవర్‌లో నివాసం ఉంటు-న్నాడు. కుంగుబాటు-కు లోనుకావడంతో కొంత కాలంగా అమన్ జైన్ చికిత్స తీసుకుంటు-న్నాడు. ఈ క్రమంలో గత శనివారం ఉదయం అమన్‌జైన్.. 32వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటు-ంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని

# కేంద్రం చేతిలోకి ఉపాధి హామీ పథకం స్టీరింగ్



న్యూఢిల్లీ :ఇప్పటి వరకూ రాష్ట్రాల అజమాయిషీలో ఉన్నజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ పూర్తిగా కేంద్రం చేతికి వెళ్లనుందా.. ఇకపై పనుల కల్పన, అంచనాల ప్రక్రియను కేంద్రమే పర్యవేక్షించనుందా.. ఇందులో భాగంగానే నూతన మొబైల్ యాప్ తీసుకొచ్చిందా.. రాష్ట్ర ప్రభుత్వం పాత్ర నామమాత్రంగా మారనుందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకునేందుకు కేంద్రం 'యుక్తధార' అనే కొత్త యాప్ తీసుకువచ్చింది. ఇప్పటి వరకు రాష్ట్రాల ఆధ్వర్యంలో సాగిన పనుల నిర్వహణను ఇకపై కేంద్రమే పర్యవేక్షించనుంది. పనుల ఎంపిక, అంచనాలు, బిల్లుల చెల్లింపుల వరకూ అన్నీ యాప్ ద్వారా నడిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఇదీ సంగతి

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు 100 రోజుల ఉపాధికి గ్యారెంటీ కల్పించాలని, ఉన్న ఊళ్లోనే పనులు కల్పించాలనే డిమాండుతో దేశవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు జరిగాయి. అనంతరం, అప్పటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నాంది పలికింది. దీనిపై 2005లో చట్టం రూపొందించింది. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఏపీఓ, ఎంపీడీఓలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. పనుల కల్పన నుంచి, బిల్లుల చెల్లింపుల వరకూ అన్నీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే నడిచేలా చర్యలు తీసుకుంది. ఏదైనా గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలంటే ఆయా గ్రామ పంచాయతీలు సామూహికంగా ఒక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించే వెసులుబాటు కల్పించారు. దీనినే సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ అంటారు. దీనిని గ్రామ కార్యదర్శి నిర్వహించాలి. ఉపాధి హామీ చట్టం -2005 ప్రకారం గుర్తించిన పనులను గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ తీర్మానాల అనంతరం మంజూరు చేయాలి. ఇప్పటి వరకూ ఇదే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యాప్తో ఇవన్నీ కనుమరుగుకానున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

యాప్తో ఏం చేస్తారంటే..

ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'యుక్తధార' పేరిట సరికొత్త మొబైల్ యాప్ తీసుకొచ్చింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులను తన అజమాయిషీలో నిర్వహించేందుకు కేంద్రం సర్వం సిద్ధం చేసింది. ఏ రాష్ట్రంలో ఎలాంటి పనులు జరుగుతున్నాయి.. ఏ ప్రాంతంలో ఏ పని ఎప్పుడు పెట్టాలి.. అంచనాలు ఎలా వేయాలి.. బిల్లులు చెల్లింపులు ఎలా జరగాలనే అంశాలన్నింటినీ ఈ యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చునే కేంద్ర ప్రభుత్వ అధికారులు నిర్ణయించే అవకాశం కలుగుతుంది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్కు ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. పనులు చేపట్టిన కూలీలకు కేంద్రమే నేరుగా బిల్లులు చెల్లిస్తుంది. యుక్తధార మొబైల్ యాప్ వినియోగం ఇప్పటికే ప్రారంభమైంది. తొలి దశలో జిల్లా వ్యాప్తంగా మండలానికో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నారు. అనంతరం, రెండో దశలో జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ దీనిని అమల్లోకి తెస్తారు. నిడదవోలు మండలం శెట్టిపేటలో ప్రస్తుతం ఇదే పద్ధతిలో పనులు కల్పిస్తున్నారు.

రాష్ట్రాల హక్కులకు భంగం

యుక్తధార యాప్ వలన రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉపాధి పథకం నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, ఇతర భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ యాప్ ద్వారా కేంద్ర పర్యవేక్షణ మొదలైతే భవిష్యత్తులో ఈ పనులన్నీ చేసే వీలుంటుందా.. ఈ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు ఎవరి పర్యవేక్షణలో విధులు నిర్వర్తించాలి.. రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే, అవినీతి నిర్మూలనకే ఈ యాప్ తెచ్చామని కేంద్రం చెబుతోంది. అవినీతి నిర్మూలించాలంటే కఠిన నిబంధనలు తీసుకురావాలే తప్ప.. కేంద్రం ఆ ధీనంలోకి తీసుకోవడమేంటనే వాదన కూడా వినిపిస్తోంది. దీని వలన పనుల కల్పన తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నా రు. ఈ యాప్ వలన ఉపాధి హామీ పథకంపై రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోతాయని, ఇది పూర్తిగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అత్యంత కలుషిత నగరాల్లో ఢిల్లీకి ఐదోస్థానం..



న్యూఢిల్లీ, ఏప్రిల్ మాసంలో దేశంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో ఢిల్లీ ఐదో స్థానంలో నిలిచింది. వేసవిలోనూ ఢిల్లీ ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందడం లేదని స్పష్టమవుతున్నది. వేసవిలోనే ఈ పరిస్థితి ఇలా ఉంటే శీతాకాలంలో మరెలా ఉంటుందనేదానికి అద్దం పడుతున్నది. అదే సమయంలో 80శాతం రోజుల్లో కాలుష్యం సాధారణ స్థాయిలోనే ఉంది.

సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ ఇటీవలి నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలోని 273 నగరాల్లో 248 (90శాతం) ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కంటే చాలా ఎక్కువ కాలుష్య స్థాయి ఉందని నివేదిక పేర్కొంది. 248 నగరాల్లో 227 జాతీయ ప్రమాణాల ప్రకారం పీఎం 2.5 స్థాయిని కలిగి ఉన్నాయి. మరో వైపు ఏప్రిల్ నెలలో ఢిల్లీ సగటు PM 2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 119 మైక్రోగ్రాములుగా ఉన్నది. ఈPM 2.5 స్థాయి ఆరోగ్యానికి మాత్రమే ప్రమాదకరమేమీ కాదు కానీ.. ఈ కాలుష్య స్థాయిలో ఎక్కువ కాలం జీవించడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. దేశంలోని పది అత్యంత కలుషిత నగరాల్లో సివాన్, రాజ్‌గిర్, ఘజియాబాద్, గురుగ్రామ్, హాజీపూర్, బాగ్‌పత్, ఔరంగాబాద్, ససరాం నగరాలు ఉన్నాయి. ఇందులో బీహార్ నుంచే ఐదు నగరాలు, ఉత్తరప్రదేశ్ నుంచి రెండు, అస్సాం, హర్యానా, ఢిల్లీ నుంచి ఒక్కొక్క నగరం ఉన్నది. ఈ సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో కాలుష్య స్థాయి చాలా ఎక్కువగా ఉందని, మిగిలిన రోజుల్లో సంవత్సరం కాలుష్యాన్ని నియంత్రించినప్పటికీ, అది ఇప్పటికీ వార్షిక సగటు ప్రమాణాల కంటే ఎక్కువగా ఉంటుందని నివేదిక స్పష్టం చేస్తుంది.

# నా జోక్యం వల్లే అణు యుద్ధం తప్పింది..



వాషింగ్టన్, రెండు దేశాలతో వాణిజ్యం నిలిపివేస్తానని బెదిరించి భారత్, పాకిస్థాన్‌ను కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వెల్లడించారు. వైట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, మీతో చాలా పెద్ద మొత్తంలో వాణిజ్యం చేయనున్నామని ఆ రెండు దేశాలకు చెప్పానన్నారు. 'ఇక యుద్ధం ఆపెయ్యండి. మీరు ఆపేస్తే మనం వాణిజ్యం చేద్దాం. మీరు ఆపకపోతే మాతో ఇక మీరు ఎటువంటి వాణిజ్యం చేయలేరు' అని భారత్, పాక్‌ను బెదిరించానని ట్రంప్ తెలిపారు. హఠాత్తుగా ఆ రెండు దేశాలు కూడా తాము కూడా యుద్ధం ఆపేయాలని ఆలోచిస్తున్నట్టు చెప్పాయని ఆయన అన్నారు. ఆ రెండు దేశాల నిర్ణయాలపై వాణిజ్యం బలమైన ప్రభావం చూపిందని ఆయన చెప్పారు.'చాలా కారణాలు ఉండొచ్చు. కాని అందులో వాణిజ్యం చాలా ముఖ్యమైనది' అని ట్రంప్ వెల్లడించారు. తాను జోక్యం చేసుకున్నందువల్లే రెండు దేశాల మధ్య అణు యుద్ధం తప్పిందని తాను భావిస్తున్నట్టు ఆయన వ్యాఖ్యానించారు. 'అణు యుద్ధాన్ని మేము ఆపాం. అదో ఘోరమైన అణు యుద్ధం అయ్యేదని నేను భావిస్తున్నాను. లక్షలాది ప్రజలు మరణించి ఉండేవారు' అని ట్రంప్ తెలిపారు. భారత్, పాక్‌తో అమెరికా పెద్ద ఎత్తున వాణిజ్యం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌తో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే పాకిస్థాన్‌తో కూడా చర్చలు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. రెండు దేశాలు సంక్షోభాన్ని పరిష్కరించుకున్న విధానాన్ని చూసి తాను గర్విస్తున్నానని ఆయన తెలిపారు. ఆ రెండు దేశాలలోని నాయకత్వం స్థిరంగా, శక్తివంతంగా ఉందని చెప్పారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోగల వివేచన కూడా వారిలో ఉందని ఆయన అన్నారు.

# ఆనాడు ఇందిర ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గలేదు

హైదరాబాద్, ప్రస్తుతం భారత్- పాకిస్తాన్ యుద్ధంపై చర్చ కంటే ఎక్కువ ఇందిరా గాంధీ ఉన్నప్పుడు జరిగిన యుద్ధం గురించే ఎక్కువగా మాట్లాడుతున్నారని టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1971లో భారత్- పాక్ మధ్య భయంకర యుద్ధం జరిగింది.. అప్పుడు ప్రధాని ఇందిరమ్మ తీసుకున్న నిర్ణయాలు.. ధైర్యాన్ని యావత్ ప్రపంచం మెచ్చుకుంది.. ఇందిరా గాంధీ యుద్ధం చేసే సమయంలో కూడా ప్రతిపక్షంతో కూడా విమర్శలు రాకుండా చేశారని పేర్కొన్నారు. ఈ మధ్య జరగుతున్న పాకిస్తాన్- ఇండియా మధ్య యుద్ధంతో ఇందిరా గాంధీ జ్ఞాపకం వచ్చిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ నిర్ణయాలపై ఇప్పుడు చర్చ జరుగుతుంది అని జగ్గారెడ్డి తెలిపారు. అయితే, అమెరికా అప్పట్లో కూడా యుద్ధం ఆపాలని చూసింది.. కానీ ఇందిరాగాంధీ ఊరుకోలేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. భారతదేశ ప్రజల నిర్ణయంలో తలదూర్చొద్దని బాహాటంగానే చెప్పారు.. తప్పని పరిస్థితిలో పాకిస్తాన్ ప్రధాని తల వంచారని గుర్తు చేసుకున్నారు. ఇక, అప్పుడు ఇందిరమ్మను అటల్ బిహార్ వాజ్ పాయ్.. అపర కాళీ అని ప్రశంసించారు.. పార్లమెంట్ లో రాజకీయాలకు అతీతంగా వాజ్ పాయి ఇందిరా గాంధీని పొగిడారు అని చెప్పుకొచ్చారు. కులం, మతం కాదు.. అందరూ ఆమెను అభినందించారని చెప్పుకొచ్చారు. ఇందిరా గాంధీ వస్తున్నారంటే.. మూడు రోజుల ముందే సభ పెట్టే స్థలంలో ప్రజలు ఉండే వారు.. నేను చిన్నగా ఉన్నప్పుడు ఆర్ఎస్ఎస్ శాఖకి పోయేవాడ్ని.. మా ఇంట్లో మా అమ్మ దుర్గామాత ఫోటో పక్కన ఇందిరా గాంధీ ఫోటో పెట్టీ పూజించేది అన్నారు. గొప్ప కోసం కాదు.. నిజాలు కాబట్టి చెప్తున్నాను అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. ఇక, ఆ రోజుల్లో ఇందిరా గాంధీ అంటే ఇండియా గాంధీ అని పిలిచే వాళ్లు అని టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



తెలిపారు. రాహుల్ గాంధీ కుటు-ంబం చరిత్ర ఇది.. ఇప్పుడు జరుగుతున్న యుద్ధంపై కంటే ఎక్కువ చర్చ ఇందిరమ్మ చేసిన యుద్ధం గురించి మాట్లాడుతున్నారు.. కాగా, బీజేపీ మాట్లాడే దానికి తోక, తొండం ఉండదు.. బీజేపీ వాళ్లకు ఏడ్వడం ఎక్కువ, చేయడం తక్కువని సె-టైర్లు వేశారు. అమెరికా వద్దంటే ఇప్పుడున్న బీజేపీ ప్రభుత్వం ఎందుకు యుద్ధం ఆపిందని ప్రశ్నించారు. మరోవైపు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సీఎం రేవంత్ ని విమర్శించడం అంటే కాంగ్రెస్ పార్టీని తిట్టినట్లేనని చెప్పుకొచ్చారు. ప్రతీ పనికి మాలిన మాటలకు కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం లేదు.. నేను 19 ఏండ్ల క్రితం కౌన్సిలర్ నీ.. అప్పుడు ఈటల ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. నేను రౌడీలకు రౌడీ నీ.. మంచోడికి మంచివాడిని అన్నారు. కేసీఆర్ పార్టీ పెట్టకపోతే...ఈ-టె-ల ఎవరు?.. ఎవరో పుణ్యమాని లీడర్ అయ్యావు నువ్వు అని జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు.

# జీవన్ రెడ్డికి దామోదర ఫుల్ సపోర్ట్..? అందుకేనా?

హైదరాబాద్,కరీంనగర్ జిల్లా పర్యటనలో ఓ మంత్రి చేసిన కామెంట్స్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. తనకు సంబంధంలేని ఓ అంశంలో ఆ మంత్రి జోక్యం చేసుకుని కామెంట్ చేయడం కాకపుట్టిస్తోంది. ఇది ఆ మంత్రి ఫ్లోలో చేశారా.. లేక తనకు సంబంధం లేకుండా తన శాఖలోని అధికారులను మార్చేశారన్న కోపంలో చేశారా అన్నది చర్చనీయాంశంగా మారింది?అసలు ఆ మంత్రి చేసిన కామెంట్స్ ఏంటి.. ఇంతకీ ఆ మంత్రి ఎవరు ? వాచ్ దిస్ స్టోరీ.తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేసిన కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాఫిగ్గా మారాయి. తాను కరీంనగర్ జిల్లా ఇంచార్జ మంత్రి కాకపోయినా%ొ% తనకు ఏం సంబంధం లేకపోయినా జగిత్యాల రాజకీయంపై దామోధర రియాక్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఆల్ ఆఫ్ సడెన్ గా జగిత్యాల జిల్లా పర్యటనకు వెళ్లారు మంత్రి దామోధర రాజనర్సింహ. ధర్మపురిలో ఏదో మొక్కు తీర్చుకున్న ఆయన.. జగిత్యాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో రివ్యూ చేశారు.ఆ తర్వాత నేరుగా మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అంతవరకు అంతా బాగానే ఉన్నా.. జీవన్ రెడ్డి నివాసంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి పెద్ద అసెట్ అని..అసలు సిసలైన కాంగ్రెస్ వాది అంటూ కామెంట్స్ చేశారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అత్యంత సీనియర్ నేతని..పార్టీలో ఆయన గౌరవాన్ని కాపాడేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానంటూ చేసిన కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.మంత్రి దామోదర రాజనర్సింహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇంచార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కరీంనగర్ జిల్లా రాజకీయాలతో ఆయనకు ఏం సంబంధం లేదు. అయితే రెండు రోజుల క్రితం జగిత్యాల జిల్లాకు వెళ్లిన మంత్రి%ొ%మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అంతేకాదు.. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ సిచువేషన్ సెన్సిటీవ్ గా ఉన్నప్పటికీ%ొ% జీవన్ రెడ్డికి మద్దతుగా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

ఉప్పు, నిప్పులా..

అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచే అక్కడ సీనియర్‌నేత మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి, సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య పరిస్థితి ఉప్పు, నిప్పులా మారింది. ఇద్దరు నేతల మధ్య మాటలయుద్ధం రోజు రోజుకు తారాస్థాయికి చేరుతోంది. ఇద్దరి మధ్య పచ్చిగడ్డి భగ్గుమనేలా పరిస్థితి తయారైందట. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి దామోదర జీవన్‌రెడ్డికి మద్దతుగా కామెంట్స్ చేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అసలు జీవన్ రెడ్డి



విషయంలో ఇన్ని రోజుల తర్వాత మంత్రి దామోదర ఇప్పుడే ఎందుకిలా కామెంట్స్ చేశారన్నదానిపై రకరకాల ఊహాగానాలు విన్పిస్తున్నాయి.మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కొంత కాలంగా చేస్తున్న కామెంట్స్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టే విధంగా ఉంటున్నాయనే చర్చ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది. పార్టీ ఫిరాయింపులతో పాటు తరచూ ఏదో ఒక ఇష్యూపై జీవన్‌రెడ్డి కామెంట్స్ చేస్తున్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్టీలో ముఖ్యమైన నేతలు కూడా జీవన్‌రెడ్డి విషయంలో అంటీముట్టనట్టే వ్యవహరిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.ఇన్నాళ్లు జీవన్ రెడ్డి విషయంలో ఎప్పుడూ స్పందించని దామోధర ఇప్పుడు ఆయనను వెనుకేసుకొస్తూ మాట్లాడ్డం వెనుక మరేదో ఉందనే టాక్ నడుస్తోంది. ఈ మధ్య జరిగిన ఐఏఎస్ బదిలీల విషయంలో ఆరోగ్య శాఖలోని ఇద్దరు అధికారులను మంత్రికి సంబంధం లేకుండా బదిలీ చేశారనే చర్చ నడుస్తోంది. అప్పటినుండి రగిలిపోతున్న దామోధర%ొ%ఇప్పుడిలా రియాక్ట్ అయ్యారనే టాక్ విన్పిస్తోంది.అయితే కరీంనగర్ జిల్లాలో జీవన్ రెడ్డికి, ఎమ్మెల్యే సంజయ్ కి మధ్య అస్సలు పొసగడంలేదని బహిరంగ రహస్యమే. సీఎం రేవంత్ రెడ్డి మనిషిగానే ఎమ్మెల్యే సంజయ్ కి ముద్ర పడింది. సంజయ్ సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం నేరుగా సీఎంనే సంప్రదించి నిధులను మంజురు చేయించుకుంటున్నారట.అయితే సంజయ్ కుమార్ కి, జీవన్ రెడ్డికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరిన ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి దామోదర చేసిన కామెంట్స్ ఇప్పుడు కాకపుట్టిస్తున్నాయి. దీనిపై సంజయ్ కుమార్ వర్గం అసహనం వ్యక్తం చేస్తుండగా%ొ%అటు సీయం రేవంత్ ఈ అంశంపై ఎలా రియాక్ట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# ఈటెల పై మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ కుమార్ గౌడ్



హైదరాబాద్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ దిగజారి మాట్లాడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ వాడిన బాష చాలా దారుణంగా ఉందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఈటల రాజేందర్‌కు పదవి రాకుండా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతుంటే ఆ ఫ్రస్టేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ చూపిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. దేవాలయాల భూములను కబ్జా చేశారని ఈటలపై కేసు నమోదు అయిందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందుకు తమ ప్రభుత్వం పడిపోతుందో ఈటల చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో తరిమేస్తే బీజేపీలోకి ఈటల రాజేందర్ పోయారని అన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లే ఆలోచనలో ఈటల రాజేందర్ ఉన్నారని ఆరోపించారు. ఒక్క విజిల్ వేస్తే ఈటల సంగతి ఏంటో తమ కార్యకర్తలు చూసుకుంటారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని దోచుకున్న దొంగల్లో ఈటల ఒకరని ఆరోపించారు. ఈటల రాజేందర్, మాజీ మంత్రి కేటీ-ఆర్ వాఖ్యలు ఒకేలా ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. విమర్శలు చేసేమందుకు జాగ్రత్తగా మాట్లాడాలని అన్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడంపై మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఆయన ఏ కులం అనేది క్లారిటీ- ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముదిరాజా లేక రెడ్డి నా అనేది.. బీజేపీలో పదవులు రాలేదని మాపై అక్కసు ఎందుకని ప్రశ్నించారు. ఈటల అంటే నాకు కొంచెం గౌరవం ఉండేది.. కేసీఆర్, ఈటల వల్లనే కదా రాష్ట్రం అప్పుల పాలైంది అని ఆరోపించారు. నువ్వు భూములు కబ్జా చేయలేదా? కేసులు లేవా? అని అడిగారు. నీ హయంలోనే కదా భూములు కబ్జా అయ్యింది.. బీజేపీలో ఈటల ఇమడలేక పోతున్నారు.. కేసీఆర్ వైపు ఈటల చూస్తున్నట్టు ఉంది ఆయన మాటలు చూస్తుంటే.. సీనియర్ నాయకుడివి... సీఎం మీద అట్లా మాట్లాడొచ్చా?.. మీ భాష అక్షేపణీయం.. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఏం నేర్చుకున్నారు అని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈటల రాజేందర్ సంస్కారవంతంగా మాట్లాడాలి కదా? అని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ అలీబాబా 420 టీంలో నువ్వు ఒక మెంబర్ వే అని ఆరోపించారు. కేటీఆర్ లాగే మాట్లాడుతున్నాడు ఈటల.. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతుంది కిషన్ రెడ్డి, ఈటల కాదా?.. బీసీ అని చెప్పుకుంటారు మీరు... కానీ మిమ్మల్ని ఎవరు బీసీ బిడ్డలుగా గుర్తించడం లేదు.. తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన కేంద్రం వద్దకు ఎందుకు తీసుకు వెళ్లలేదని అడిగారు. ఒక్క ముదిరాజ్ బిడ్డని అయినా రాజకీయంగా ఎదగనిచ్చారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పులు చేస్తే చెప్పండి సరిదిద్దుకుంటాం.. కానీ, భాష, పద్ధతి మార్చుకో అని ఈటల రాజేందర్ కు ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వార్నింగ్ ఇచ్చారు.

## శ్రీవాణి టికకెట్లపై అసత్యాలు వద్దు

తిరుమల,తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఇస్తోన్న శ్రీవాణి దర్శన టికెట్లు- మిగిలిపోయాయంటూ సోషల్‌మీడియాలో కొందరు చేస్తోన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తిరుమల తిరుపతి దేవస్థానం స్పష్టం చేసింది. శ్రీవాణి టిక్కెట్లు ఏరోజు కూడా మిగిలి పోలేదని, ఇంకా డిమాండ్ ఉందని పేర్కొంది. వాస్తవానికి ఆన్‌లైన్‌లో 500 టికెట్లు-, తిరుపతి ఎయిర్‌పోర్టులో 200 టికెట్లు- అందుబాటు-లో ఉండగా.. ఎప్పటికప్పుడు భక్తులు వాటిని బుక్ చేసుకుంటు-న్నారని

# హరీష్ రావు,కవితలను సాగనంపే యత్నం



హైదరాబాద్,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పదేళ్ల బీఆర్ఎస్ పాపాలపైన మాట్లాడినందుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధన్యవాదాలు తెలిపారు. భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందని.. సామాజిక తెలంగాణ రాలేదని ఎమ్మెల్సీ కవిత మాట్లాడారని చెప్పారు. బీఆర్ఎస్ మూడు ముక్కలు, నాలుగు చెక్కలుగా మారబోతుందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో కవిత పదవులు అనుభవించి వేల కోట్లు- దండుకుని.. ఆ రోజు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాపాలపై కవిత ఇప్పుడు మాట్లాడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు, కవితలను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించాలని కేటీఆర్ చూస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆరోపణలు చేశారు. పార్టీ నుంచి బయటకు పంపించే ప్రయత్నాలు జరుగుతున్నందు వల్లనే రైతుబంధు, సామాజిక తెలంగాణ విషయాలను కవిత మాట్లాడుతోందని చెప్పారు. గతంలో విజయశాంతి, ఆలే నరేంద్రలను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించినట్లే కవితను కూడా బయటకు పంపుతారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల కోసం కవిత జైలుకు పోలేదని... లిక్కర్ స్కాం చేసి జైలుకు వెళ్లిందని విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులు, కేటీ-ఆర్ చేసిన తప్పులను కవిత బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీలో విలువ, గౌరవం లేకపోవడంతోనే కవిత మాట్లాడుతోందని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com